ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

శనివారం 11 అక్టోబరు 2025 | 5



చుక్కలనంటిన వెండి ధర!

కిలో రూ. 1,72,000 .. రూ.2 లక్షలవుతుందని అంచనా

మార్కెట్‌లో పెరిగిన కొనుగోళ్లు.. 9 నెలల్లో రెట్టింపు

బంగారమూ పరుగే.. 22 క్యారెట్ 1,13,400

24 క్యారెట్ 10 గ్రాముల ధర రూ.1,23,710

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బంగారం, వెండిపై మోజు పెరిగే కొద్దీ వాటి ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. బంగారం ధరలు వినియోగదారులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. అదే బాటలో వెండి సైతం రికార్డులు సృష్టిస్తోంది. శుక్రవారం మార్కెట్‌లో కిలో వెండి ధర అనూహ్యంగా పెరిగి రూ.1,72,000కు చేరింది. ఈ ఏడాది జనవరిలో వెండి ధర రూ.88,400 మాత్రమే. ఈ తొమ్మిది నెలల పదిరోజుల్లో ఏకంగా రెట్టింపు అయింది. త్వరలో కిలో వెండి రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉన్నట్టు మార్కెట్ వర్గాల అంచనా. రేట్లు రోజుకురోజుకు పెరుగుతుండడంతో వెండి కొనుగోలు చేసేవారి సంఖ్య కూడా పెరిగింది. భవిష్యత్ అవసరాల కోసం ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇక బంగారం ధరలు ఇప్పటికే చాలావరకు దూసుకెళ్లాయి. బంగారం ఇక సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందని వస్తువుగా మారిపోతుందేమో అనే రీతిలో ధరలు పెరిగిపోయాయి. ఆగస్టు 29న 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.94,700గా ఉంది. రాజమండ్రి మార్కెట్‌లో గురువారం నాటికి 22 క్యారెట్ ధర రూ.1,13,800కు పెరిగింది. శుక్రవారం 400 తగ్గి రూ.1,13,400 వద్ద నిలబడింది. 24 క్యారెట్ బంగారం ధర 1,23,710గా ఉంది. ఈ ఏడాది జనవరి 1 నాటికి 22 క్యారెట్ ధర కేవలం 71,150గా ఉంది. 24 క్యారెట్ బంగారం ధర రూ.78వేలు మాత్రమే. ప్రస్తుత ధరలు ఇంకా పెరుగుతాయనే ఆందోళనతో వెండి కిలో బార్లు, క్వాయిన్లు, బంగారం బిస్కట్ రూపంలోనూ కొందరు కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం.



దేవదేవంభజే

6

» ఘనంగా ప్రారంభమైన వాడపల్లి బ్రహ్మోత్సవాలు

‘రుణం’ లేదేమో!

» ఐదు నెలలుగా నిలిచిపోయిన బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల రుణాలు

» యూనిట్ల సంఖ్య పెంపు పేరుతో మంజూరైనవి మే నెల నుంచి నిలిపివేత

» అసలెప్పుడు మంజూరవుతాయో తెలియక లబోదిబోమంటున్న లబ్ధిదారులు

» అటు నియోజకవర్గాల్లో సమాధానాలు చెప్పలేక ఎమ్మెల్యేలూ సతమతం

» ఉమ్మడి జిల్లాలో 2,405 బీసీ కార్పొరేషన్ యూనిట్లకు 32,448 దరఖాస్తులు రాక

» ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే 2,732 యూనిట్లకు 13,317 దరఖాస్తులు

» నెలలు గడుస్తున్నా ఉలుకుపలుకూ లేని అధికారుల తీరుతో నిరుద్యోగుల్లో బెంగ



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల కింద నిరుద్యోగులకు ఇచ్చే స్వయం ఉపాధి యూనిట్లకు గ్రహణం పట్టింది. అప్పటి సీఎం జగన్ ఆనవాయితీగా వస్తోన్న రుణాల మంజూరు ప్రక్రియను పూర్తిగా నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం తరపున స్వయం ఉపాధి పొందే అవకాశం లేక ఎందరో పేదలు నష్టపోయారు. అయితే ప్రభుత్వం మారాక మళ్లీ బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు మంచిరోజులు వచ్చాయి. చాలా ఏళ్ల తర్వాత ఆగిపోయిన రుణాలను మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో ఈ ఏడాది ఆరంభంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల పరిధిలో స్వయం ఉపాధి యూనిట్లను ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసింది. ఈ యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు అప్పగించింది. నిరుద్యోగులకు లాభదాయకంగా ఉంటే స్వయం ఉపాధి యూనిట్లను అధికారులు గుర్తించి మంజూరుచేయాలని ఆదేశించింది. ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో ప్రభుత్వం నలభైశాతం, బ్యాంకు రుణం అరవై శాతం వచ్చేలా చేయాలని అధికారులు నిర్ణయించారు. అందులోభాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ విభాగాల్లో అధికారులు 2,405 రుణ యూనిట్లు మంజూరుచేశారు. ఫ్లవర్ బొకేలు, వర్మీకంపోస్టు యూనిట్, వెబ్ సైట్ డెవలప్‌మెంట్, ఎల్ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్‌రీసైక్లింగ్ యూనిట్లు, ఫిష్ ఫార్మింగ్, అడ్వంచర్ టూరిజం, సబ్బుల తయారీ, మొబైల్‌కార్ వాష్, బేకరీ, ఫ్లై యాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీపార్లర్, మెడికల్ ల్యాబ్, మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో, కారు, గూడ్స్ ట్రక్ ఇలా నచ్చిన వ్యాపారం ఏదైనా చేసుకునేలా దరఖాస్తు నిబంధనలు విధించారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందల్లో ఉన్న యూనిట్లకు వేలల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. బీసీ కార్పొరేషన్ పరిధిలో కాకినాడ జిల్లాకు రూ.39.52కోట్ల విలువైన 1,914 యూనిట్లకు31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147 మంది పోటీపడ్డారు. కాపు కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాలో రూ.28.24కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోనసీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది దరఖాస్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14కోట్ల విలువైన 511యూనిట్లు మంజూరవగా, ఆరు వేల దరఖాస్తులు వచ్చాయి. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లకు 5,497, కోనసీమ జిల్లాకు 1,043యూనిట్లకు 3,265, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తు చేశారు. అతి కష్టంపై వీటిని పరిశీలించిన అధికారులు ఏప్రిల్‌లో బీసీ కార్పొరేషన్ పరిధిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ రుణానికి ఆమోదం ఇచ్చారు. జాబితాలను బ్యాంకులకు పంపగా చాలావరకు రుణాలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇక యూనిట్లు చేతికి అందడ మే తరువాయి అనుకున్న తరుణంలో మే 8న అమరావతి నుంచి ఉన్న తాధికారులు తక్షణం యూనిట్ల మంజూరును నిలిపివేయాలని నోటి మాట ఆదేశాలు జారీచేశారు. దీంతో కంగుతిన్న లబ్ధిదారులు ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో వీటిని త్వరలో రెట్టింపు చేయనున్నట్లు వివరించారు.

ఉలుకుపలుకూ లేదంతే...

మే8న నిలిపివేసిన స్వయం ఉపాధి యూనిట్లను ఇప్పటికీ అధికారులు ప్రారంభించలేదు. ఒకరకంగా చెప్పాలంటే అయిదునెలల నుంచీ కనీసం వీటిపై సమాధానం కూడా ఇవ్వడం లేదు. దీంతో లబ్ధిదారులు ఈసురోమంటున్నారు. స్వయం ఉపాధి పథకానికి ఎంపికయ్యామని సంతోషిస్తే తీరా చేతికి అందినట్లే అంది చేజారిపోవడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాస్తవానికి లేకలేక మంజూరైన యూనిట్లపై లబ్ధిదారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇవి చేతికి వస్తే ఉపాధి లభిస్తుందని సంతోషపడ్డారు. కానీ అదనపు యూనిట్ల మంజూరు పేరుతో మొత్తం నిలిపివేయడంతో వీరంతా లబోదిబోమంటున్నారు. ఐదు నెలలు దాటిపోయినా అసలు ఇవి మంజూరు చేస్తారా? లేదా? అనేదానిపై జిల్లాల అధికారులకు కూడా సమాచారం లేకపోవడంతో లబ్ధిదారులకు ఏం చెప్పలేకపోతున్నారు. అటు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు సైతం తాజాగా ఈ తలనొప్పి పట్టుకుంది. పథకానికి ఎంపికైన లబ్ధిదారులు, అదనపు యూనిట్ల కోసం చూస్తోన్న నిరుద్యోగులు సైతం ఎమ్మెల్యేలు, వారి అనుచరుల చుట్టూ తిరుగుతున్నారు. ఇవి ఎప్పుడు మంజూరవుతాయో తెలుసు కోవాలంటూ ఒత్తిడి తెస్తుండడంతో ప్రజాప్రతినిధులకు ఏం పాలుపోవడం లేదు. పైగా మంజూరైన యూనిట్లు పెంచాలని ఒత్తిడి తెచ్చింది తామే అయినా చివరకు ఉన్నవీ నెలల తరబడి ఆగిపోవడంతో సమాధానాలు చెప్పలేక గింజుకుంటున్నారు. వాస్తవానికి యూనిట్ల సంఖ్యను అధికారులు పెంచాలనుకుంటే తొలివిడత యూనిట్ల మంజూరు ప్రక్రియను పూర్తిచేసి రెండోదశ ప్రక్రియ ఆ తదుపరి ప్రారంభిస్తే నిరుద్యోగులకు ఏఇబ్బంది ఉండేది కాదు. తీరా పెంపు పేరుతో అసలుకే ఎసరు పడడంతో అంతా తలపట్టుకుంటున్నారు. మరోపక్క ప్రభుత్వం రావడంతో తమ బంధువులకు సైతం ఏదొక ఉపాధి యూనిట్ మంజూరు చేయించుకోవాలని భావించిన పార్టీ నేతలు, క్యాడర్‌కు నిరాశే ఎదురైంది. తాజాగా అయిదు రోజుల కిందట అమరావతిలో సంక్షేమశాఖలపై సమీక్ష జరిగింది. యూనిట్ల పెంపు, మంజూరుపై ఇందులో స్పష్టత వస్తుందని అంతా భావించినా ఈ ప్రస్తావన లేకపోవడంతో ఎప్పుడు మంజూరవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

జీఎస్టీ జోష్

» జిల్లాలో విస్తృత ప్రచారం » రాజమండ్రిలో ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

» జీఎస్టీ సంస్కరణలతో తగ్గిన ధరలు » ప్రతీ కుటుంబానికి లబ్ధి : జేసీ



సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ పేరుతో ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ మేఘస్వరూప్

రాజమహేంద్రవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీఎస్టీ అమలుపై విస్తృత ప్రచారానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. గత నెల 22వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ 2.0 విధానం వల్ల రెండే శ్లాబ్ రేట్లు అమలులోకి రావడంతో పలు వస్తువులపై జీఎస్టీ తొలగించడంతో పాటు, కొన్నింటిపై శ్లాబ్ తగ్గించడంతో ఈ ఫలితాలను ప్రజలకు చేర్చడానికి ప్రభుత్వం నడుంబిగించింది. గత నెల 22 నుంచి రోజుకు ఒక కార్యక్రమం కింద జిల్లావ్యాప్తంగా ప్రచారం సాగిస్తోంది. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు కూడా వివిధ మాల్‌లను తనిఖీ చేయడంతోపాటు, వ్యాపారులకు, ప్రజలకు కూడా అవగాహన పరుస్తున్నారు. ఈ క్రమంలోనే రాజమహేంద్రవరంలోని దర్మంచర హాల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, జీఎస్టీ తూర్పు, కోనసీమ జిల్లాల జాయింట్ కమిషనర్ ఎం. సుధాకరరావు ప్రారంభించారు. వివిధ మండలాల్లో కూడా వేర్వేరుగా వాణిజ్య పన్నులశాఖ అధికారులు ప్రదర్శనలు, అవగాహన నిర్వహించారు. ఆల్‌కాట్ గార్డెన్స్ సర్కిల్ అధికారులు వీఎల్ పురంలో నిర్వహించగా, దీనికి వ్యాపారులు ఎక్కువగా హాజరయ్యారు. శనివారం కూడా ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ఆయా వస్తువుల ధరలు తగ్గడంతో జిల్లాలో ప్రతీ కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజలకు లాభాలు ప్రత్యక్షంగా లభించేలా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పేరుతో ప్రజలకు అవగాహన పెంచడమే లక్ష్యమన్నారు. టీవీలు, ఏసీలు, బీక్సీలు, వాషింగ్ మిషన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో వినియోగదార్లకు రూ.5 వేల నుంచి 15 వేలవరకూ లబ్ధి చేకూరుతుందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాలకు ఆర్థిక లాభం కలుగుతుందని చెప్పారు. జీఎస్టీ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని ఆయన అధికార్లను ఆదేశించారు. మండల గ్రామ స్థాయిల్లో కూడా అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నట్టు చెప్పారు. జీఎస్టీ (స్టేట్) జాయింట్ కమిషనర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశం జీఎస్టీ తగ్గింపు ఫలాలు వినియోగదార్లకు అందాలన్నదే అని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ టీవీ నాగేశ్వరరావు, ఆఫీసర్లు హస్సేన్ షరీఫ్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కె. సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి. పక్కన ఎన్ఎస్ఐసీ జీఎం సురేష్‌బాబు తదితరులు

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణం ఉందని.. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలు మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం-నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ ద్వారా తొలిసారిగా ఇక్కడ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువ పారిశ్రామికవేత్తలకు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. పరిశ్రమలు ఏర్పాటుచేసే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా ప్రగతి మార్గంలో పయనిస్తున్న వారి అనుభవాలను యువ పారిశ్రామికవేత్తలకు తెలియజేయాలన్నారు. పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న సబ్సిడీలు, మార్కెట్ అవకాశాలు, శిక్షణ, రుణ సదుపాయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. టాటా ఇన్నోవేషన్ హబ్ తరహాలో ఎస్సీ, ఎస్టీ హబ్ అందిస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకోవాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ఎంఈ యూనిట్ల స్థాపనకు ప్రోత్సాహకాలు అందించడానికి సిద్ధంగా ఉన్నాయని.. ఎస్సీ, ఎస్టీ యువత, మహిళలు ముందుకు రావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ హబ్‌పై మరింత సమాచారం కోసం 040-27125618 నెంబరులో లేదా ఎస్సీ, ఎస్టీ హబ్ వెబ్‌సైటులో సంప్రదించాలని నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ జోనల్ జనరల్ మేనేజర్ వి.సురేశ్‌బాబు సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం రామన్ శ్రీనిధర్, ఏపీఐఐసీ జెడ్ఎం పద్మజ పాల్గొన్నారు.

జిల్లాలో యథాతథంగా ఉచిత వైద్యసేవలు

ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ ప్రియాంక వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలు యథాతథంగా కొనసాగుతున్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి. ప్రియాంక తెలిపారు. ఈమేరకు శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మె కారణంగా వైద్యసేవలకు సంబంధించి జిల్లా ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, సాధారణ ఉచిత వైద్యసేవలు పొందవచ్చన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సేవలు అందుబాటులో ఉన్నాయని, అదనంగా జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పటల్, రాజమహేంద్రవరంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఉచిత సేవలు లభిస్తాయన్నారు. ఉచిత వైద్యసేవలకు ఏమైనా సహాయం అవసరమైతే డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయ అధికారి సెల్ 9281068129, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయం నెం: 9281068159 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

మహిళల సెల్‌ఫోన్లలో శక్తి యాప్ ఉండాలి : ఏఎస్పీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల సెల్‌ఫోన్లలో శక్తి యాప్ ఉంటే భద్రతాపరంగా అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని అదనపు ఎస్పీ (పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వల్ల దుష్ప్రభావాలు, మహిళల రక్షణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. గుర్తు తెలియని, అపరిచిత వ్యక్తులతో చాటింగ్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వాటికి దూరంగా ఉండడం శ్రేయస్కరమన్నారు. ఓటీపీలు ఇతరులకు చెప్పడం, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయడం, బ్యాంకు ఖాతా వివరాలను అపరిచితులతో పంచుకోవడం వల్ల చిక్కుల్లోపడే ప్రమాదం ఉందన్నారు. పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, కేవైసీ అప్‌డేట్ అంటూ వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబపరమైన నష్టాలు, మహిళలు స్వీయరక్షణ టెక్నిక్స్, పోక్సో చట్టం, సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై వివరించారు. మోసపోకుండా ఉండాలంటే అప్రమత్తతే తొలి ఆయుధంగా గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి, ఎస్సై అమీనాబేగం, జిల్లా సైబర్ ల్యాబ్ పోలీసులు వై.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న జేసీ వై.మేఘ స్వరూప్

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలి : జేసీ

కొవ్వూరు,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు గోనె సంచులను అందుబాటులో ఉంచుకోవాలని జాయింటు కలెక్టర్ వై. మేఘస్వరూప్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొవ్వూరు పట్టణ, మండలంలోని రైతు సేవా కేంద్రాలు, సొసైటీలతోపాటు కొవ్వూరులో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర రైస్ మిల్లు, కాపవరంలో జొన్నలగడ్డ ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్‌మిల్లులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాల్లో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు అన్ని వసతులు ఉన్నాయా, పూర్తిస్థాయి సిబ్బంది ఉన్నారా అని పరిశీలించారు. అలాగే గోనె సంచులు, సార్టెక్స్ కెపాసిటీలను పరిశీలించారు. కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జేసీ అధికారులను ఆదేశించారు. జేసీ వెంట పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ బి.గణేష్‌కుమార్, జిల్లా సరఫరా అధికారి వి.పార్వతీ, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారి ఎ. గంగాధర్, సీఎస్‌డీటీ సునీత పాల్గొన్నారు.



మహిళా సంఘ సభ్యులు తయారు చేసిన అగరుబత్తీలను కలెక్టర్ కీర్తికి అందజేస్తున్న దృశ్యం

‘మహిళలు ఆదాయ వనరులు సృష్టించడం అభినందనీయం’

కడియం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): పూల వ్యర్థాలతో మహిళలు అగరబత్తీలు తయారు చేయడం, స్వయం ఉపాధి ద్వారా ఆదాయ వనరులు సృష్టించడం ప్రశంసనీయం అని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం కడియం ప్రాంతంలో అగరబత్తీల తయారీ యూనిట్, కొబ్బరి తాళ్ల యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ పొందిన మహిళలతో సమావేశమై మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ దిశలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మరిన్ని యూనిట్లు స్థాపించేందుకు మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. డిమాండ్‌కు అనుగుణంగా యూనిట్ స్థాపన ఉండాలి... భవిష్యత్తులో ఏర్పాటు చేసే యూనిట్ల విషయంలో ముడిసరుకు, లభ్యత నుంచి మార్కెటింగ్ వరకు ప్రతీ అంశాన్ని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఆ మేరకు ఖచ్చితత్వం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. అలాగే మార్కెటింగ్ సహకారం కీలకమని, మహిళల చొరవతో కడియం నేచురల్ అగరబత్తీలు అనే ప్రత్యేక బ్రాండ్ రూపుదిద్దుకోవడం గర్వకారణమని కలెక్టర్ ఆ మహిళలను అభినందించారు. బ్యాంకు సహకారంతో తొలిదశలో 12 మంది మహిళలు యూనిట్ స్థాపనకు ముందుకు రావడం ప్రశంసనీయం అన్నారు. అనంతరం కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవానర్సరీని కలెక్టర్ కీర్తి చేకూరి సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందజేసి కలెక్టర్ కీర్తి చేకూరికి స్వాగతం పలికారు. అలాగే కడియపులంక పూల మార్కెట్‌ను సందర్శించారు.

రూ7.32 కోట్లతో గ్రీనింగ్ కారిడార్ల అభివృద్ధి : కలెక్టర్ కీర్తి

గతేడాది ఆమోదించిన పనులు వందశాతం పూర్తిచేయాలి.. అధికారులతో సమీక్ష

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గతేడాది రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో ఆమోదించిన పనులు వందశాతం పూర్తి చేయాలని ఇంచార్జి కమిషనర్ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో డిస్ట్రిక్ లెవెల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ)కింద రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న పనులపై అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ7.32 కోట్లతో చేపడుతున్న గ్రీనింగ్ కారిడార్ల అభివృద్ధి పనులు, పెద్ద మొక్కలు నాటడం, అలాగే అకిరా మియావాకి మోడల్ మొక్కలు పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వాయుకాలుష్యం మరింతగా తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని దిశనిర్దేశం చేశారు. ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్ల నిర్వహణ మరింత క్రమబద్ధంగా చేపట్టాలని, 2030 నాటికి మొత్తం వాహనాల్లో కనీసం 30 శాతం వాహనాలు ఎలక్ట్రిక్ వాహనాలు ఉండేలా లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను సీఎన్‌జీ మోడ్‌కి కన్వెర్ట్ చేసే చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పీసీబీ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎంవీఎస్ శంకర్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, కార్పొరేషన్ ఎస్ఈ ఇన్చార్జి రీటా, డీఈ కె.లోవరాజు పాల్గొన్నారు.





ధ్వజ పటం ఎగురవేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకస్వాములు

కోనసీమ తిరుమల వాడపల్లి కాంతులీనింది. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. చందనస్వరూపుడైన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవానికి అంకురార్పణ జరిగింది. ఆలయ ముఖ, వసంత మండపాల్లో ఫల, పుష్ప అలంకరణలు సుగంధ పరిమళాలు వెదజల్లాయి. కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను అలరించారు.

- ఘనంగా ప్రారంభమైన వాడపల్లి వెంకన్న 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు
- ధ్వజారోహణతో అంకురార్పణ చేసిన అర్చకస్వాములు, వేదపండితులు
- తొలి రోజు రాత్రి శేష వాహనంపై భక్తులకు అభయమిచ్చిన శ్రీవారు

దేవదేవం భజే

ఆత్రేయపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన శుక్రవారం ఉదయం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు... స్వస్తివచనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరుణ, దీక్షాధారణ, అకల్మష హోమం, అగ్ని ప్రతిష్ఠాపనలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, వాస్తు పూజ, హోమాలు జరిపారు. వసంత మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ధ్వజారోహణం గావించారు. ధ్వజపటాన్ని మేళతాళాలలో ఊరేగించి దేవతలను ఆహ్వానించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠించిన గురుడికి ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. వాయిద్య కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. రాత్రి శ్రీవారు పరావాసుదేవ అలంకరణలో శేష వాహనంపై కొలువుదీరి తిరువీధుల్లో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు.



పూజలు చేస్తున్న చైర్మన్ వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు సూర్యచక్రధరరావు దంపతులు





శేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు, హారతి తీసుకుంటున్న భక్తులు



భద్రతా ఏర్పాట్లపై ఈవోతో చర్చిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజీ, ఎస్పీ

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు. మాడవీధులు, పార్కింగ్ ప్రదేశం, క్యూలైన్ల ఏర్పాట్లను చూసి భద్రతా ఏర్పాట్లపై ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. వేలాది మంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు 800 మంది సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఉన్నారు.



బయట తిండి... కడుపు మండి



రవికుమార్ ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తాడు. ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే అవకాశం లేకపోవడంతో ఓ హోటల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తాడు. సాయంత్రం ఆఫీసు నుంచి వెళ్తూ వెళ్తూ... నూడిల్స్, ఫ్రైడ్‌రైస్, బజ్జీ మిక్చర్... ఇలా ఏదో ఒకటి బయట ఫుడ్ తిని ఇంటికి చేరతాడు. వారం క్రితం కడుపులో మంట రావడంతో వైద్యులను సంప్రదించాడు. బయట జంక్ ఫుడ్ తినడం వల్ల ఈ సమస్య వచ్చిందని డాక్టర్ చెప్పారు.



- మారుతున్న ఆహారపు అలవాట్లు
- ఉరుకులు, పరుగుల జీవనంలో స్ట్రీట్ ఫుడ్‌పైనే ఆధారం
- రోగాలపాలవుతున్న జనం
- పెరుగుతున్న గ్యాస్ట్రిక్ సమస్యలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)




కిరణ్‌కుమార్‌కు పెళ్లయ్యింది. వీధి వీధి తిరిగి వ్యాపారం చేస్తాడు. ఉదయం ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయటకు వ్యాపారం నిమిత్తం వస్తాడు. రాత్రి ఏడెనిమిది గంటలకు తిరిగి ఇంటికి వెళ్తాడు. అయితే ఈ సమయంలో ఆయన ఆకలిదప్పికలు తీర్చుకునేది పూర్తిగా బయటే. మధ్యాహ్నం ఏదో ఒక హోటల్‌లో భోజనం.. సాయంత్రం స్నాక్స్ తర్వాత ఇంటికి వెళ్లడం.. ఇదే అతడి రోజువారీ తంతు.

వారే కాదు.. ఇలాంటి వారెందరో బయట ఆహారంపైనే ఆధారపడుతున్నారు. లేనిపోని అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. ఉరుకులు, పరుగుల జీవనంతో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. ముఖ్యంగా ఇటీవలి కాలంలో బయట ఆహారం తినేందుకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇంట్లో వంట చేసే సమయం లేని కొందరు.. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. వారంలో కనీసం రెండు, మూడు రోజులు ఇలా స్ట్రీట్ ఫుడ్‌లపై ఆధారపడుతున్నారు.

ఆహార పదార్థాల విక్రయాలు మొదలు, వంట నూనెల ఉత్పత్తుల నుంచి విక్రయదారుల వరకు ప్రతి ఒక్కరూ ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం కింద లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు పదివేల మందికిపైగా హోటళ్లు, ఫుడ్, బేకరీస్, ఆయిల్ ఉత్పత్తి తదితర వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపారం రూ.కోట్లలో జరుగుతోంది. అయితే వీరిలో ఫుడ్ లైసెన్స్ తీసుకుని వ్యాపారం చేసే వారు చాలా తక్కువ. ఇటీవలి కాలంలో స్ట్రీట్ ఫుడ్ బిజినెస్ విపరీతంగా పెరగడంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పెరిగిపోయాయి. ప్రజలు కూడా బయట ఆహారాన్ని తినేందుకు ఆసక్తి చూపుతుండడంతో వీరి వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతోంది.

హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, బజ్జీల కొట్లు, గోబీ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర వాటిల్లో కల్తీ నూనెను ఎక్కువగా వినియోగిస్తున్నారు. మల్టీసోర్స్ విజిటబుల్ ఆయిల్స్ (ఎంఎస్‌వీవో), అగ్‌మార్క్ నిబంధనలకు లోబడి నిర్దేశిత పరిమాణంలో నూనెలు కలపాలి. కానీ కొందరు తమ ఇష్టానుసారంగా నూనెలు కల్తీ చేస్తున్నారు. ఆరోగ్యానికి హానికరమైన టేస్టింగ్ సాల్ట్, కాల్షియం కార్బైడ్ తదితర ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నారు. ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. అయితే ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారులు, నగరపాలక ఆరోగ్య శాఖాధికారులు చోద్యం చూడడం విశేషం.

తాజా పదార్థాలుగా చూపి...



మాంసం, చేపలు, రొయ్యలతో తయారుచేసే నాన్ వెజ్ ఆహారాన్ని రోజుల తరబడి డీప్ ఫ్రిజ్‌లో ఉంచుతున్నారు. వినియోగదారులు కోరినప్పుడు వాటికి మసాలాలు దట్టించి వేడివేడిగా వడ్డిస్తున్నారు. సాస్‌లు, బిర్యానీ, తందూరీ చికెన్లలోనూ కృత్రిమ రంగులు కలుపుతున్నారు. మిఠాయిలు, కేక్‌లు, మసాలాలు, మాంసాహారానికి ఎరుపు రంగు, బంగాళాదుంప చిప్స్, పాప్‌కార్న్ వంటి వాటికి పసుపు రంగు, ఐస్‌క్రీమ్, సూప్‌లు, బఠానీ తదితర వాటికి నీలం, ఆకుపచ్చ రంగులు వాడుతున్నారు. కృత్రిమ రంగులు అద్దడం వల్ల అవి నాణ్యంగా, తాజాగా ఉన్నట్టు కనిపిస్తాయి. రోజుల తరబడి నిల్వ ఉన్న వాటిని తాజా పదార్థాలుగా భ్రమించి ఆరగిస్తున్న వినియోగదారులు రోగాల బారిన పడుతున్నారు.

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి నెలకు సుమారు వెయ్యి మంది వరకు ఓపీ వస్తారు. వారిలో 40 శాతం బయట ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధ వ్యాధుల బారిన పడిన వారే. వీధిలో తిండి తింటే కడుపులో మంట ఖాయమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం...

పదేపదే కాచిన నూనెతో చేసిన వంటకాలు తింటే తొలుత గ్యాస్ట్రిక్, అల్సర్ తర్వాత క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కల్తీ చేసిన వాటితో గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయని గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు చెప్తున్నారు. కృత్రిమ రంగులు కలిపిన వాటిని ఎక్కువకాలం తినడం వల్ల మనుషులు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. పిల్లల్లో హైపర్ యాక్టివ్, అలర్జీ లక్షణాలు కనిపిస్తాయి. పురుషుల్లో మూత్రనాళ ఇన్ఫెక్షన్లతో పాటు జీర్ణకోశ వ్యాధులు, ఉబ్బసం వంటివి తలెత్తుతాయి. సింథటిక్ రంగులు మహిళల విషయంలో రుతు సంబంధ ఇబ్బందులు, మైగ్రేన్ తలనొప్పి, థైరాయిడ్, గర్భకోశ, కిడ్నీ, కాలేయ వ్యాధులకు కారణమవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దాలి

- ఆర్‌జేడీ నాగమణి
- డీఎస్సీ-2025కు ఎంపికైన ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



రాజానగరంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి (ఇన్‌సెట్లో) ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు/కాకినాడ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శారీరక, మానసిక నైతిక వికాసం, విజ్ఞానం అందించి సమగ్ర మూర్తిమత్వం గల పౌరులుగా తీర్చిదిద్దాలని జోన్-2 ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఉద్బోధించారు. నూతన ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు నిర్వహించిన ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. రాజానగరం మండలంలో ఆరు కేంద్రాల్లో ఈ శిక్షణా తరగతులు నిర్వహించగా జీఎస్ఎల్ దంత కళాశాలలో జరిగిన ముగింపు వేడుకలకు ఆర్‌జేడీ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువలు కలిగిన అద్భుతమైన సమాజం నిర్మించేది ఉపాధ్యాయులేనన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన జీఎస్ఎల్ వైద్య సంస్థల అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ మంచి సమాజం నిర్మించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు. భూపాలపట్నంలోని రైట్ కళాశాలలో జరిగిన ముగింపు సభలో డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి నుంచి అభ్యసనా ఫలితాలను సాధించేందుకు వినూత్నమైన వ్యూహాలతో బోధించాలని సూచించారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఎనిమిది రోజులపాటు బోధనా పద్ధతులు, బోధనా వ్యూహాలు, పాఠ్యప్రణాళికలు నిరంతర సమగ్ర మూల్యాంకనపుస్తకం, ఉపాధ్యాయ కరదీపిక, హోలిస్టిక్ ప్రగతిపత్రం పాఠ్య ప్రణాళికలు తదితర నూతన అంశాలపై శిక్షణ ఇచ్చారు. తెలుగు, హిందీ, భౌతిక, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, ఫిజికల్ డైరెక్టర్‌లకు అన్ని అంశాల్లో శిక్షణ ఇచ్చారు. తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ముగింపుసభలో కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్జీటీలకు ఆర్ఐఎఫ్‌టీ ఇంజనీరింగ్ కళాశాలలో వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల్లో నియామక ఉత్తర్వులను ఇచ్చామన్నారు. స్కూల్ అసిస్టెంట్, పీజీటీ కేడర్ ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కేటాయించబడతాయని తెలిపారు. ఉపాధ్యాయుల మెరిట్ ర్యాంకు ఆధారంగా వారు ఎంపిక చేసుకున్న ఆప్షన్లమేరకు పోస్టింగ్ ఆర్డర్లు ఆన్‌లైన్‌లో జనరేట్ అవుతాయన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులు నియామక ఉత్తర్వులను లీప్ యాప్‌లో వ్యక్తిగత లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 13న వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని సూచించారు. ఇండక్షన్ ట్రైనింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు తదుపరి విడతలో నిర్వహించే శిక్షణకు హాజరై పూర్తిచేసిన తరువాత మాత్రమే వారు పోస్టింగ్ ఆర్డర్లు పొందాల్సి ఉంటుందని డీఈవో రమేష్ పేర్కొన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏడు కేంద్రాల్లో మెగా డీఎస్సీ 2025 నూతన ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. అయితే ఏడింటిలో ఆరు కేంద్రాలు రాజానగరం మండలంలోనే ఎంపిక చేసి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆరింటికి 1424 మంది నూతన ఉపాధ్యాయులను కేటాయించగా 1415 మంది శిక్షణకు హాజరయ్యారని, 9 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి

కాకినాడలో కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా



కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని, 8వ వేతన సంఘం సిఫార్సులను పెన్షనర్లందరికీ వర్తింపజేయాలన్న డిమాండ్లతో న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నా కు మద్దతుగా శుక్రవారం కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు ధర్నా చేశారు. ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా చైర్మన్ పి.మహేశ్వరరావు, కన్వీనర్ తురగా సూర్యారావు, ఫైనాన్స్ కార్యదర్శి డీఎల్ఎన్ శాస్త్రి ఆధ్వర్యం వహించారు. ప్రధాన తపాలా కార్యాలయం నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. ఆల్ పెన్షనర్స్ యూనియన్ నా యకులు జీవీ లక్ష్మీనారాయణ, డి.మాణిక్యాలరావు, సీహెచ్ రామారావు, ఎం.కూర్మారావు,ఎన్. త్రినాథరావు, ఎన్.భాస్కరరావు, దేగల వీరభద్ర రావు, యూఎస్ఎన్ రెడ్డి,సురేష్‌రెడ్డి, ఎం.శ్రీరామ్మూర్తి, హుస్సేన్, సుభాన్ పాల్గొన్నారు.

13న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు.వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్ భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

రేపు ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ

శెట్టిబలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి



సమావేశంలో మాట్లాడుతున్న కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీ సాయంత్రం 4గంటలకు రాజమహేంద్రవరం త్యాగరాజ భవన్‌లో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర శెట్టిబలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తెలిపారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఎంపిక శెట్టిబలిజ విద్యార్థులు 300 మందికి స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు.576 నుంచి 600 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు, 551 నుంచి 575 మార్కులు సాధించిన వారికి రూ.5 వేలు, 500 నుం చి 550 మార్కులు సాధించిన వారికి రూ.3,500 స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, బీసీ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారిలను సత్కరిస్తామన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు విచ్చేయనున్నట్టు చెప్పారు. స్కాలర్‌షిప్స్ ఇచ్చేందుకు మంత్రి వాసంశెట్టి సుభాష్ సీఎస్ఆర్ ఫండ్స్ రూ.10 లక్షలు ఇప్పించారని కుడుపూడి పేర్కొన్నారు. కాగా స్కాలర్‌షిప్స్ పంపిణీకి మొత్తం 300 మంది విద్యార్థులకు గాను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 120 మంది, మిగిలిన కాకినాడ, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల నుంచి 180 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు సమాచారం. సమావేశంలో శ్యామలాంబ దేవస్థానం చైర్మన్ కడియాల వీరభద్రరావు, బుడ్డిగ రాధా, కడలి రామకృష్ణ, శీలం గోవింద్, ముసిని బాబురావు, చింతపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నన్నయలో ఆహార మహోత్సవం



ఆహార మహోత్సవం బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న ఆహార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ కోరారు. అరటి ఆకులపై వినూత్న రీతిలో సిద్ధం చేసిన ఆహార మహోత్సవం బ్రోచరును ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 16న ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా 14,15,16 తేదీల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు, పాల్గొనేందుకు విశ్వవిద్యాలయం ఫుడ్ అండ్ టెక్నాలజీ విభాగాన్ని 86395 50186లో గాని, విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను గాని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య డి.కళ్యాణి, అధ్యాపకులు ఎం.కృష్ణవేణి, కె.సింధుజ తదితరులు పాల్గొన్నారు..

యువతకు ఫర్నిచర్ ఫిట్టింగ్‌లో శిక్షణ !

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా యువతను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ ఫర్నిచర్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రతినిధులు కలెక్టర్ చాంబర్‌లో కలిసారు. ఈ సందర్భంగా ప్రాంతీయ నిరుద్యోగ యువతకు ఫర్నీచర్ ఫిట్టింగ్ శిక్షణ ప్రారంభించేందుకు కలెక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత స్కిల్ చాప్టర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ట్రైనర్ విలాసిని, విశ్వనాథ్ పాల్గొన్నారు.

జేఎన్టీయూకేలో ముగిసిన

హాకథాన్-2025



జేఎన్టీయూకే, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో రెండు రోజులు నిర్వహించిన హాకథాన్-2025 శుక్రవారం ముగిసినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. జేఎన్టీయూకే డైరెక్టరేట్ ఆఫ్ ఇంక్యుబేషన్ సెంటర్(డీఐసీ) సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 80మంది విద్యార్థులు పాల్గొని విభిన్న రంగాల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రతిపాదించారు. జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఆవిష్కరణలు దేశ జీడీపీ పెరుగుదలకు, భారత ఉత్పత్తిరంగ అభివృద్ధికి సహకరిస్తాయన్నారు. డీఐసీ డైరెక్టర్ డాక్టర్ ఏ.గోపాలకృష్ణ విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలకు మద్దతునివ్వడంలో డీఐసీ పాత్రను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, లీలాకుమారి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్

సత్యదేవుడి సన్నిధిలో పలు వసతులకు పాలకమండలి చైర్మన్ ఆమోదముద్ర



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు

అన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు పాలకమండలి చైర్మన్ ఐవీ రోహిత్ ఆమోదముద్ర వేశారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రధానంగా రూ.4.72 లక్షలతో ప్రకాష్‌సదన్ కాటేజీ నందు విద్యుత్ సరఫరాకు సంబంధించి మెటీరియల్ కొనుగోలుకు, రూ.6.14 లక్షలతో సత్యదేవుడి తెప్పోత్సవంలో తాత్కాలిక విద్యుత్ అలంకరణలకు, రూ.5.10 లక్షలతో మెయిన్‌క్యాంటీన్‌ను డార్మెటరీగా మార్చి భక్తులకు మౌలిక వసతులు కల్పించేందుకు ఆమోదం తెలిపారు. రూ.6 లక్షలతో ఆగమ పాఠశాల వద్ద విద్యార్థుల వసతికి సంబంధించి మెరుగైన సౌకర్యాల కల్పన, రూ.1.40 లక్షలతో కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవ నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇటీవల నిర్వహిచిన వివిధ షాపుల బహిరంగ వేలం లో అధిక మొత్తానికి వచ్చిన టెండర్లను, దేవస్థానంలో వివిధ పనులకు సంబంధించి పనులలో లోయస్ట్‌టెండర్‌కు ఆమోదం లభించింది. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, ఏఈవోలు, సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.

రత్నగిరిపై ప్రొటోకాల్ వాట్సాప్ మెసేజ్‌లు కుదరవు

ఐదు రోజులు ముందుగా ఇచ్చే సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం

అన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్రంగదులు, దర్శనాలు, వ్రతముల నిర్వహణ కోసం ప్రముఖులు అందించే వాట్సాప్ మెసేజ్‌లకు ఇకపై కేటాయింపు నిలుపుదల చేయనున్నట్టు ఈవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సిఫారస్ లేఖలను 5రోజుల ముందుగా అందజేస్తేనే కేటాయింపు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించి సహకరించాలని కోరింది.

సత్యదేవుడికి బస్సు విరాళం

ప్రత్యేక పూజల అనంతరం అందించిన ఎస్‌బీఐ చైర్మన్

అన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీనివాసులు శెట్టి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానానికి విచ్చేసే భక్తులకు రవాణా సౌకర్యం కోసం 32 సీట్లు సామర్థ్యం కలిగిన సుమారు రూ.25 లక్షల విలువైన బస్సును విరాళంగా అందజేశారు. ఈ బస్సు తాళాలను ఎస్‌బీఐ చైర్మన్ దేవస్థానం ఈవో, చైర్మన్‌కు అందజేశారు. ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ పటేల్, హేమంత్‌కుమార్, పంకజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరం ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌కు బస్సు అందజేస్తున్న ఎస్‌బీఐ చైర్మన్



మంగళగిరిలోని సి.కె.కన్వెన్షన్‌లో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పిల్లల మానసిక స్థితిని తల్లిదండ్రులు గుర్తించాలి

కాకినాడ జీజీహెచ్ మానసిక వైద్య నిపుణుడు వరప్రసాద్

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యుక్త వయసుకు వచ్చిన పిల్లల మానసిక స్థితిని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గుర్తించాలని కాకినాడ జీజీహెచ్ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జీజీహెచ్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మానసిక ఆరోగ్య పరిస్థితిపై ఒక ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా నిలదొక్కుకోగలం అనేదానిపై ముందు నుంచీ అవగాహన లేకపోతే ఆత్మహత్యలకు దారితీయవచ్చన్నారు. మానసిక అనారోగ్య లక్షణాలను గమనించిన వెంటనే మానసిక వైద్య నిపుణుడిని కలిసి అవసరమైన చికిత్స తీసుకోవాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్య సమస్యల మాదిరిగానే ఒక్కో సారి మానసిక సమస్యలు అత్యవసరంగా రావచ్చన్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరం బాణసంచా ఘటనపై

కొనసాగుతున్న దర్యాప్తు

ఏలూరు రేంజ్ పరిధిలో బాణసంచా తయారీ కేంద్రాలపై ముమ్మర తనిఖీలు : డీఐజీ



రాయవరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

రాయవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్ పరిధిలో అన్ని జిల్లాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు, హోల్‌సేల్ స్టాక్ పాయింట్లు తాత్కాలిక లైసెన్స్ పొందిన షాపులపై ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి తనిఖీ చేసిన సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఈనెల 8న రాయవరం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన బాణసంచా విస్ఫోటనం ప్రమాదంపై దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఎఫ్ఎస్ఎల్ టీం క్లూస్ వివరాలు సేకరించిందని, ప్రమాదంపై రిపోర్టు రావాల్సి ఉందన్నారు. తాను ఇప్పటికే అమలాపురం, మండపేట తదితర ప్రాంతాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేశానన్నారు. ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నప్పటికీ అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఫైర్‌సేఫ్టీ పరికరాలను వినియోగించేందుకు ఆపరేటర్ చేసే వ్యక్తి లేనట్టు గుర్తించినట్టు చెప్పారు. ప్రతి బాణసంచా తయారీ కేంద్రం వద్ద ఫైర్‌సేఫ్టీ మెకానిజం ఉపయోగించేందుకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించేలా ఆయా దుకాణదారులను అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీకి సూచించారు. బాణసంచా కొనుగోలు చేసి వచ్చే సంవత్సరం ఉపయోగించుకోవచ్చనే ఆలోచనతో కొంతమంది ఇంట్లో బాణసంచా నిల్వ ఉంచినా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలు ఇంట్లో గాని, అనుమతులు లేకుండా గాని బాణసంచా నిల్వలు ఉంచరాదన్నారు. ఆయన వెంట ఎస్పీ రాహుల్ మీనా, డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ దొరరాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐ పుల్లారావు, ఎస్ఐ డి.సురేష్ బాబు ఉన్నారు.

జీజీహెచ్ గైనిక్ విభాగంలో

యువకుడు హల్‌చల్

ముగ్గురిని గాయపర్చిన వైనం

భయపడిన బాలింతలు

మానసిక రోగి అని తెలిసి

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



యువకుడు దుర్గాప్రసాద్

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ గైనిక్ విభాగంలో గురువారం రాత్రి ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. గతంలో ఎంతోమంది చంటి బిడ్డలను ఎత్తుకుపోయిన ఉదంతాలు జరిగిన నేపథ్యంలో పిల్లలను ఎత్తుకుపోయేందుకు వచ్చాడని అతడి పట్టుకునేందుకు గర్భిణులు, బాలింతల సహాయకులు ప్రయత్నించగా సుమారు ముగ్గురిని పళ్లతో కరిచి గాయపర్చి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. వివరాలిలా ఉన్నాయి. యానాం శివారు కోలంకకు చెందిన 20 ఏళ్ల ఆకుల దుర్గాప్రసాద్ గురువారం రాత్రి గైనిక్ విభాగంలోని బాలింతల వార్డు వద్ద చంటి పిల్లలు ఉన్న చోట అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అక్కడ ఉన్న బాలింతలు వారి సహాయకులకు చెప్పడంతో వారు దుర్గాప్రసాద్‌ను నిలదీశారు. అతడు కంగారుపడి ముగ్గురిని చేతుల జబ్బలపై కరిచి గాయపరిచాడు. ఇంతలో సెక్యూరిటీ సిబ్బంది అక్కడకి చేరుకుని బిత్తర చూపులు చూస్తున్న ఆ యువకుడిని పట్టుకుని జీజీహెచ్ అవుట్‌పోస్ట్ పోలీసులకు అప్పగించారు. వారు అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో ఆ యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు. వారి ఇచ్చిన సమాచారం మేరకు దుర్గాప్రసాద్ తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని తమ కుమారుడు మానసిక రోగి అని, కాకినాడలో ఓ ప్రైవేటు సైకియాట్రీ ఆసుపత్రిలో చికిత్స ఇప్పిస్తున్నట్టు ఆధారాలతో పోలీసులకు చూపించడంతో ఆ యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఉండ్రాజవరం, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో గుండెపోటుతో వ్యక్తి మరణించిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ డి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలంగిలో అమిరిశెట్టి దుర్గాప్రసాద్ (42) శుక్రవారం ఉదయం బాత్రూమ్‌కు వెళ్లిన అనంతరం అక్కడిక్కడే గుండెపోటుతో మరణించాడు. అతడు ప్రైవేటు వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఈ సంఘటన జరిగింది.ఎస్ఐ కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు..

మండలంలోని చివటం రైల్వే గేటు సమీపంలో సెప్టెంబరు 25న తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన గంటా గౌతమ్‌కుమార్ (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గౌతమ్ కుమార్‌ను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గౌతమ్ కుమార్ అప్పుల బాధ భరించలేక పురుగుమందు తాగినట్టు ఎస్ఐ తెలిపారు. అతడికి భార్య, తొమ్మిది నెలల పాప ఉన్నారు. ఎస్ఐ రవికుమార్ పర్యవేక్షణలో ట్రైనీ ఎస్ఐ కె.నవీన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



గంజాయితో పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

గోకవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్టు కోరుకొండ సీఐ సత్యకిషోర్ తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా గోకవరం పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. స్థానిక ఠాణా సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులపై అనుమానంతో తనిఖీ చేశామని, వారి వద్ద 11 కిలోల గంజాయిని గుర్తించామన్నారు. గంజాయితో పాటు వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని స్కూటీని సీజ్ చేశామన్నారు. నిందితులు రాజమహేంద్రవరానికి చెందిన చింతల మురారి, సూరి హేమంత్, దూలపల్లి నానిగా గుర్తించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించనున్నట్టు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో వెండి ఆభరణాలు చోరీ



పేరవరంలో చోరీ జరిగిన వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆత్రేయపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి స్వామివారికి అలంకరించిన వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఆలయ తలుపులను పగలు గొట్టి కిరీటం, అభయహస్తలు, శంఖుచక్రాలు, శఠగోపం చోరీ చేసినట్టు ఆలయ ధర్మకర్త వెంపాటి కృష్ణమూర్తి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు.

ఒంటరి మహిళను బెదిరించి చోరీ..

పదిమంది అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వనాథ్

రూ.16 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

తణుకు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలోని వారణాసి వారి వీధిలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళను చంపుతామని బెదిరించి బంగారు ఆభరణాలు అపహరించిన కేసులో పదిమంది నిందితులను శుక్రవారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్ తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత నెల 26న ఒంటరిగా నివాసం ఉంటున్న వాకలపూడి కనకదుర్గను అర్ధరాత్రి సమయంలో ముఖానికి మాస్కులు ధరించి వచ్చి ఇంటిలోకి వచ్చి దుండగులు ఆమె చేతులను వెనక్కికట్టి, అరిస్తే చంపుతా మని బెదిరించి ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న ఆభరణాలు సుమారు 70 కాసులతో పాటు రూ.70 వేల నగదును తస్కరించారు. కేసును సీఐ కొండయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. పదిమంది మరికొంత మందితో కలిసి ప్రణాళిక ప్రకారం దోపిడీకి పాల్పడి బంగారం, నగదు దొంగిలించి అందరూ పంచుకున్నట్టు గుర్తించారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన సందీప్ రామశంకర్ ఉపాధ్యాయ, మహమ్మద్ ఇక్బాల్ షేక్, రాజమహేంద్రవరానికి చెందిన మీసాల శ్రీనివాసరావు, నిమ్మకాయల శ్రీకాంత్, దుర్గాపు సత్యనారాయణ, దివ్వల యేసు, బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన గొర్రెపూడి వెంకటరమణ, శ్రీకాకుళం చిన్న, కర్రి సాయి, చంద్రారెడ్డిను శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి పది బంగారు గాజులు, చెవి దిద్దులు జత, మాటీలు జత కలిసి 162.25 గ్రాముల బంగారు వస్తువులైన రూ.16లక్షలు విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐలు కె.కొండయ్య, బి.కృష్ణకుమార్, బి.బి.రవికుమార్, ఎస్ఐలు కె.శ్రీనివాసు, కె.ప్రసాదు, డి.ఆదినారాయణ ఉన్నారు.

యువకుడి మృతి కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రామ్‌కుమార్

సీతానగరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి గ్రామానికి చెందిన మురాల అనిల్ దేవ (22) మృతి కేసులో బొబ్బిల్లంక గ్రామానికి చెందిన కప్పల సతీష్, రాజమహేంద్రవరానికి చెందిన కాలుకురాన వరుణ్ (చిన్ని)లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు... గత నెల 29న అనిల్ దేవ మునికూడలిలోని ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతుడి తల్లి కువైట్ నుంచి వచ్చిన అనం తరం ఈనెల 3న కుటుంబ సభ్యులు సమక్షంలో శవ పరీక్ష నిర్వహించారు. కేసు విచారణ అనంతరం సెక్షన్‌లను మార్పు చేశారు. సతీష్, వరుణ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని, నిందితులను జైలుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసు విచారణ కొనసాగుతోందని, ఇంకా ఎవరైనా వ్యక్తులు ఉన్నట్టు నిర్ధారణ అయితే వారిని అరెస్ట్ చేస్తామన్నారు.

32మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు కొట్టివేత

ఆలమూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో 32 మందిపై ఉన్న అభియోగం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ శుక్రవారం రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. ఆలమూరు మండలం గుమ్మిలేరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులో వచ్చిన వివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో 2017 అక్టోబరులో ఒక వర్గం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 38మందిపై అప్పటి ఎస్ఐ ఎం.శేఖర్‌బాబు కేసు నమోదు చేశారు. అలాగే మరో వర్గం ఇచ్చిన ఫిర్యాదుతో పలువురిపై కేసు నమోదు చేశారు. అయితే ఒక కేసులో 6నెలల క్రితమే కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. అయితే 38 మందిలో ఆరుగురు మృతిచెందారు. మిగిలిన 32మందిపై ఉన్న అభియోగం రుజువు కాకపోవడంతో కేసును కొట్టి వేస్తూ శక్రవారం రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి సాయిసునంద తీర్పు చెప్పారు. ఈ కేసులో న్యాయవాదులుగా ఎస్ఎస్.ప్రకాశరావు, నామన సీతారాములు ఉన్నారు.

తాటాకిల్లు దగ్ధం

నల్లజర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామంలో ఊర మహంకాళికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం మహంకాళి ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. వెంటనే బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో గ్రామస్తులు మంటను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో తాడేపల్లిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి మురళీ కొండబాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50 విలువ చేసే సామగ్రి కాలిపోయినట్టు అధికారులు అంచనా వేశారు.

కారును ఢీకొన్న లారీ

నలుగురికి తీవ్రగాయాలు

ప్రత్తిపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కత్తిపూడి నుంచి ఎర్రవరం వైపు వెళ్తున్న కారును లారీ ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న బాబ్జి, సుబ్బారావు, నాగరాజు, ఈశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక ఆసుపత్రికికి తరలించారు. డాక్టర్ గీత వైద్యం అందించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ భూమి అప్పగించాల్సిందే

- కాకినాడ నడిబొడ్డున 17ఎకరాలు ప్రైవేటు పరం
- రూ.510కోట్ల విలువైన భూమి బ్రైట్ టౌన్ కంపెనీకే..
- తక్షణం స్థలాన్ని పిటిషనర్‌కు అప్పగించాలని న్యాయస్థానం ఆదేశాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ నగర నడిబొడ్డున ఉన్న 17ఎకరాల భూమి ప్రైవేటుపరం అయిపోయింది. రూ.510కోట్ల విలువైన ఈ భూమిని పిటిషనర్‌కే అప్పగించాలని కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి తాజాగా తీర్పు నిచ్చారు. కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలకు ఎదురుగా ఉన్న ఈ 17 ఎకరాల భూమి తమదంటే తమదని ఒకపక్క ప్రభుత్వం, మరోపక్క ముంబైకి చెందిన బ్రైట్ టౌన్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 1980నుంచీ న్యాయస్థానంలో పోరాడుతున్నాయి. దీనిపై సుదీర్ఘంగా పలు న్యాయస్థానాల్లో కేసు విచారణ కొనసాగుతూ వచ్చింది. అప్పట్లో కాకినాడ అర్బన్ మండలంలోని రమణయ్యపేట గ్రామం పరిధిలో 134/3 సర్వే నెంబర్‌లో ఉన్న ఈ భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు తమవేనని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ ఆ భూమిని పిఠాపురం మహారాజా నుంచి తాను కొనుగోలు చేసినట్లు పిటిషనర్ వాదిస్తూ వస్తున్నారు. దీనికి సంబంధించి న్యాయస్థానాల్లో ఆధారాలతో కూడిన దస్తావేజులను చూపించారు. ఈ భూమి తమదేనని వాదిస్తోన్న అధికారులు సరైన భూరికార్డులు చూపించడంలో విఫలమవుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత ఎట్టకేలకు ఇన్నేళ్ల తర్వాత తాజాగా తీర్పు వెలువరించారు. రికార్డులు, ఇతర ఆధారాలన్నీ పిటిషనర్‌కు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న న్యాయస్థానం మొత్తం భూమిని బ్రైట్‌టౌన్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అప్పగించాలని ఆదేశించింది. కాగా నగరం నడిబొడ్డున ఉన్న పదిహేడెకరాల స్థలం ఇక్కడ ఎకరా రూ.30కోట్ల వరకు పలుకుతోంది. ఇంతటి విలువైన భూమి విషయంలో సరైన రికార్డులు న్యాయస్థానానికి అధికారులు అందజేయడంలో విఫలమవడంతో ప్రైవేటుపరం అయినట్లయింది. కాగా ఈ భూమిలో కొంత ప్రదేశంలో ప్రధాన రహదారిని ఆనుకుని ప్రభుత్వ బాలుర వసతిగృహమైన ఆనంద నిలయం ఉంది.

సామర్లకోట భీమేశ్వరాలయ ఆదాయం రూ.19.96 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సామర్లకోట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో హుండీల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం ఆలయ ఆవరణలో దేవదాయ అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తసంఘం సభ్యులతో నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం, ధర్మకర్తల మండల చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు. 21 మార్చి నుంచి 9 అక్టోబరు 2025 వరకూ 199 రోజులకు గాను భక్తులు హుండీలలో వేసిన కానుకల ద్వారా 19,96,390 లభించినట్టు ఈవో నీలకంఠం పేర్కొన్నారు.

కాలినడకన కాశీ యాత్రకు పయనం...

ఐ.పోలవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.మూలపొలానికి చెందిన ఓలేటి దుర్గారావు కాలినడకన కాశీ యాత్రకు బయలు దేరాడు. శుక్రవారం గ్రామంలో ఆర్ఎస్ఎస్ సేవకుడు రెల్లు గంగాధరం ఆధ్వర్యంలో గ్రామస్తులు దుర్గారావును ఆశీర్వదించి కాశీ యాత్రకు పంపించారు. 40రోజుల్లో ఆయన కాశీ చేరుకోనున్నట్టు చెబుతున్నారు. దుర్గారావును పరిసర గ్రామాల ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యుడు ఆకుల సత్తిబాబు పాల్గొన్నారు.



కాలినడకన కాశీ బయలుదేరిన ఓలేటి దుర్గారావును అభినందిస్తున్న ప్రజలు

పాఠశాలల్లో బోధనేతర పనుల బహిష్కరణ


గోకవరంలో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

ఫ్యాప్టో ప్రతినిధులు

గోకవరం/బిక్కవోలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో బోధనకు మాత్రమే పూర్తి సమయాన్ని వెచ్చిస్తూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు గాను బోధనేతర పనులను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఫ్యాప్టో ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గోకవరం, బిక్కవోలులో మండల విద్యాశాఖాధికారులు ఎం.చిమ్మిరాజుదొర, సీహెచ్‌వీవీ సత్యనారాయణలకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు, పరీక్షల నిర్వహణ వంటి అవసరమైన పనులు తప్ప బోధనేతర పనులకు చెందిన అన్ని ఆన్‌లైన్ పనులను రాష్ట్ర వ్యాప్తంగా బహిష్కరిస్తున్నామని వారు ప్రకటించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు కె.నాగభూషణం, ఎం.ప్రేమ్‌కుమార్, పంతం త్రిమూర్తులు, ఎస్.కుమార్, శర్మ, నాగేంద్ర, బి.అప్పారావు, కె.శ్రీనివాస్ పాల్గొనగా బిక్కవోలులో గోవిందరావు, సత్యనారాయణ, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్‌కుమార్, సీతారామ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సోలార్ సెల్ తయారీ పరిశ్రమ



రాజమహేంద్రవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వెబ్‌సోల్ కంపెనీ రూ.3 వేల కోట్ల పెట్టుబడితో సోలార్ సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రముఖ పారిశ్రామికవేత్త, కొవ్వూరుకు చెందిన టీడీపీ సీనియర్ నేత ఎస్.రాజీవ్‌కృష్ణ తెలిపారు. వెబ్‌సోల్ కంపెనీ ఎండీ ఎల్ఎల్ అగర్వాల్ తదితరులు మంత్రి నారా లోకేశ్‌ను కలసినట్టు ఆయన తెలిపారు. ముందు వచ్చే పెట్టుబడులు తమ కంపెనీ ప్రణాళికల గురించి అగర్వాల్ లోకేశ్‌కు వివరించారన్నారు.ఈ ప్రాజెక్టు కేవలం నారా లోకేశ్ అవిశ్రాంత ప్రయత్నాల వల్ల, ప్రోగెసివ్ లీడర్ సీఎం చంద్రబాబు వల్ల వచ్చినట్టు రాజీవ్‌కృష్ణ తెలిపారు. రాష్ట్రానికి పరిశ్రమలు తేవడంలో లోకేశ్ టీమ్‌లో రాజీవ్‌కృష్ణ కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆదాయం ఘనం..
అభివృద్ధి శూన్యం

- సమస్యల వలయంలో చక్రద్వారబంధం
- గగ్గోలు పెడుతున్న గ్రామస్థులు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు


చక్రద్వారబంధంలో వ్యర్థాలతో దర్శనమిస్తున్న మంచి నీటి చెరువు

రాజానగరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రద్వారబంధం గ్రామ పంచాయతీ దశాబ్దాల తరబడి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలో పరిశ్రమలతో పాటుగా రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంతో పంచాయతీకి ఎనలేని ఆదాయం సమకూరుతున్నా అభివృద్ధికి మాత్రం అమడ దూరంలో ఉంది. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో విలీన ప్రక్రియతో గ్రామంలో పంచాయతీ ఎన్నికలు నిలిచిపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామంలో గోదావరి జలాలు గత ఏడాది నవంబరు నెల నుంచి పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నీళ్లు కావాలంటే పని మానుకోవాల్సిందే శీర్షికన గత ఏడాది నవంబరులో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంతో స్పందించిన అప్పటి కలెక్టర్ పి.ప్రశాంతి గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటుకు రూ.16.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రామంలో 960అడుగుల లోతున ఏర్పాటు చేసిన బోరు నుంచి రెండున్నర అంగుళాల పరిమాణంలో మాత్రమే నీరు వస్తోంది.గ్రామంలో మరో మూడు బోర్లు ఉన్నప్పటికీ ఒకటిన్నర, రెండు అంగుళాలు మాత్రమే సరఫరా చేస్తున్నాయి.దీనికి తోడు పంచాయతీ కుళాయిల వాల్వులు సక్రమంగా లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. గ్రామంలో పూర్వం నుంచి ఏకైక మంచి నీటి వనరుగా ఉన్న ఊరచెరువు కాలుష్య కాసారంగా మారింది. గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను మంచినీటి చెరువులోకి మళ్లించడంతో చెరువులో నీరు దుర్గంధం వస్తోంది. గ్రామంలో దోమల విజృంభిస్తున్నప్పటికీ ఏడాది కాలంగా కనీసం దోమల మందు పిచికారీ చేసిన దాఖలాలు లేవన్నారు. అలాగే గ్రామంలో డ్రైన్లలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందన్నారు. వీధి లైట్లు పూర్తి స్థాయిలో వెలగడం లేదని, దాంతో దొంగతనాలు జరుగుతున్నాయని, ఇటీవల కాలంలో నాలుగు బైక్‌లు చోరీకి గురయ్యాయని బాధితులు వాపోయారు. ఏడాది కాలంలో ఇంటి,కుళాయి పన్నుల రూపంలో దాదాపు రూ.40 లక్షలకు పైబడి వసూలు చేశారు. గ్రామంలో ఏవిధమైన అభివృద్ధి పనులు చేపట్టకపోయినా ప్రస్తుతం రూ.8లక్షలు మాత్రమే పంచాయతీలో ఉన్నట్టు తెలుస్తోందన్నారు. గ్రామంలోని వీధులన్నీ చెత్తకుప్పలతో దర్శనమిస్తుంటాయి. శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోకపోవడంతో దహన సంస్కారాలు సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. చక్రద్వారబంధం పంచాయతీపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.


సచివాలయానికి వెళ్లే రోడ్డులో వృథాగా పోతున్న తాగు నీరు

జీఎస్టీ తగ్గింపుతో అందరికీ మేలు

- కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ కుమారి
- పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు


రామవరం సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్రం జీఎస్టీ తగ్గింపుతో అందరికీ మేలు జరుగుతుందని కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్, బిక్కవోలు మండల జీఎస్టీ ప్రత్యేకాధికారి ఎం.కుమారి అన్నారు. జీఎస్టీ 2.0పై శుక్రవారం పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బిక్కవోలులో కరణం గారి మేడ వద్ద ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ అండ్ హోమ్ అప్లయిన్సెస్ ఎగ్జిబిషన్ కమ్ సేల్స్‌లో వస్తువుల ధరలను జీఎస్టీ తగ్గించి అమ్ముతున్నారో లేదో పరిశీలించారు. గతంలో వున్న ధరలను, జీఎస్టీ వల్ల తగ్గిన తర్వాత ధరలను ఆమె గ్రామస్థులకు వివరించారు. అనంతరం మెడికల్ షాపుల్లో జీఎస్టీ అమలును తనిఖీ చేశారు. ఈమె వెంట సర్పంచ్ సరెళ్ల సుమలత, కూటమి నాయకులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, ఓవీ కృష్ణ, జి.త్రిమూర్తులు, వెంకన్నబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గిరిడా గంగాభవాని అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నెక్స్ జనరేషన్ సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని, దీనిని విరివిగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా జీఎస్టీ సంస్కరణలపై ప్రదాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు సర్పంచ్ గంగాభవాని కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యక్రమంలో చింతా సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజానగరం/కోరుకొండ: రాజానగరంలోని వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రముఖ కంపెనీల డిజిటల్, ఎలక్ట్రానిక్ వస్తువులు మేళాను, కోరుకొండలోని అపర్ణ ఏజెన్సీలో ఏర్పాటు చేసిన కోరుకొండ మండల గ్రాండ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఆర్థిక ప్రయోజనం తో పాటు పొదుపు మెరుగుపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఓవైపు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ, మరో వైపు సూపర్ జీఎస్టీ సంస్కరణలను తీసుకొచ్చి ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రముఖ వ్యాపార సంస్థలు తగ్గిన జీఎస్టీ విలువల ప్రకారం వ్యాపారులు ప్రత్యేక ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలన్నారు. దీనిలో భాగంగా వివిధ రకాలైన వస్తువులను వినియోగదారులకు విక్రయించారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏవి శ్రీనివాస్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సురేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం: రూరల్ నియోజకర్గ పరిధిలోని ఆదిత్య ఎంటర్ ప్రైజెస్, ఆవ రోడ్డు, తాడితోట జంక్షన్‌లో ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎం.సుధా కరరావు, ఆల్కాట్ గార్డెన్స్ సర్కిల్ శ్రీనివాసరావు జీఎస్టీ అధికారి ఎన్.నీరజ, తదితరులు పాల్గొన్నారు. జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ వస్తువుల మీద 28శాతం నుంచి 18శాతానికి తగ్గిన ట్యాక్స్ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఎంతో లాభదాయకమని పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య, అర్థశాస్త్ర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జీఎస్టీ 2.0 ప్రయోజనాలు, సవాళ్లు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పీవీ సత్యనారాయణ, ఆర్.బాలయ్య, కె.ఆనందరావు, పి.షణ్ముఖరావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.


కోరుకొండలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

ప్రతిభావంతులను దాతలు ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


విద్యార్థికి లాప్‌టాప్ అందిస్తున్న ఎమ్మెల్యే వాసు, అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దాతలు ముందుకొచ్చి ప్రతిభ గల పేద విద్యార్థులను ప్రోత్సహించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పిలుపునిచ్చారు. శుక్రవారం రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో శశి ఇంజనీరింగ్ కళాశాలలో మూడో ఏడాది చదువుతున్న శివప్రియకు ల్యాప్‌టాప్‌ను మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుతో కలిసి అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పిలుపుతో ప్రతిభ గల విద్యార్థులను ఆదుకోవడానికి దాతలు ముందుకొస్తున్నారని, సాయం పొందిన వాళ్లు ఉన్నత స్థానాలకు చేరుకున్నాక మరో 10 మందికి సాయపడాలన్నారు. అప్పారావు మాట్లాడుతూ తమ భవానీ చారిటబుల్ ట్రస్ట్ తరఫున పేద విద్యార్థులకు, క్రీడాకారులకు సహాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాశి నవీన్‌కుమార్,మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకిరామయ్య, ద్వారా పార్వతిసుందరీ, శివారెడ్డి పాల్గొన్నారు.

మానసిక రోగులపై వివక్ష తగదు

జీజీహెచ్‌లో అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తుల పట్ల వివక్షత చూపరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా సుపత్రిలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లోని మానసిక విభాగంలో చికిత్స పొందుతున్న వారి వివరాలు, వారికి అందుతున్న వైద్యసదుపాయాలు, ఇతర వివరాలను ఆసుపత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారితోను, వారి కుటుంబ సభ్యులతోను మాట్లాడారు. అనంతరం శ్రీలక్ష్మి మాట్లాడుతూ మానసిక రోగుల హక్కులను పరిరక్షించడానికి, వారికి ఆరోగ్యసేవలను అందించడానికి మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం-2017 రూపొందించారన్నారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు న్యాయ సేవలు అందించడానికి ఎల్ఎస్‌యూఎం యూనిట్ ప్రతి జిల్లాలో పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ కర్రి రామారెడ్డి, డాక్టర్ అమూల్య, డాక్టర్ లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తి జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి మానసిక ఆరోగ్య కౌన్సిలర్, స్పెషలిస్ట్ భ్యులా గ్రేస్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం,వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు.

'అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు' రాజకీయ కుట్ర

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి, టీడీపీ ఎస్సీనేతలు


అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చిత్తూరు జిల్లా దేవలంపేటలో నిప్పుపెట్టడం వైసీపీ రాజకీయ కుట్రలో భాగమేనని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆరోపించారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడాన్ని నిరసిస్తూ రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద నుంచి గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. విగ్రహానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ మనుగడ కోల్పోతున్న వైసీపీ రాష్ట్రంలో దళితుల ఆత్మగౌరవంతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ దళిత వ్యతిరేకి అని, అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీలకు లబ్ధి చేకూర్చే 27 పథకాలను రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు బొర్రా చిన్ని, మొకమాటి సత్యనారాయణ, కవులూరి వెంకట్రావు, దుత్తరపు గంగాధర్, అజ్జరపు రమేష్, కోరుమిల్లి విజయశేఖర్, ప్రభుదాస్, ఆంటోని పాల్గొన్నారు.

జన్యువ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభం: డీఎంహెచ్‌వో

ఎస్టీ బాలికలు, బాలుర హాస్టల్ విద్యార్థులకు సికిల్ సెల్ రాపిడ్ పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ వంటి జన్యుపరమైన వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా తగిన చికిత్స అందించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని ఎస్టీ బాలికలు, బాలుర వసతిగృహాల్లో విద్యార్థులకు సికిల్ సెల్ రాపిడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ బాలికల హాస్టల్లోని మొత్తం 391 మంది విద్యార్థినిల్లో 281 మందికి గతంలోనే పరీక్షలు నిర్వహించామని, శుక్రవారం అందుబాటులో ఉన్న 70 మందికి, బాలుర హాస్టల్లో 345 మందిలో 260 మందికి గతంలో పరీక్షలు చేయగా, తాజాగా 35 మందికి ర్యాపిడ్ పరీక్షలు చేశామని తెలిపారు. జిల్లాలోని ఎస్టీ వసతిగృహాలు, పాఠశాలలు, కాలేజీల్లో ఇలాంటి కార్యక్రమాలు దశలవారీగా కొనసాగుతాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూహ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ షమ్మీ కుమార్, డిప్యూటీ డెమో ఎన్ఆర్‌పీఎస్ సత్యకుమార్, జిల్లా ఎపిడమాలజిస్ట్ డాక్టర్ సుధీర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏకగ్రీవం

కోరుకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ సచివాలయ విలేజ్, వార్డ్ సెక్రటేరియట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోరుకొండ మండల శాఖ నూతన కార్యవర్గం శుక్రవారం సాయంత్రం స్థానిక సచివాలయం కార్యాలయ ఆవరణలో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా బి.వీరేంద్ర నాగ్, కార్యదర్శి కె.ఆనంద్‌తో 14 మందితో మండల కమిటీ ఏర్పాటు జరిగింది. ఈ ఎన్నికలకు సంఘ జిల్లా ఛైర్మన్ వరసాల రామదాసు అధ్యక్షత వహించగా, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కోరుకొండ తాలూకా కార్యదర్శి డి.భగవాన్దాస్ పరిశీలకుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఉద్యోగుల సమస్యలను జిల్లా నాయకులు తెలుసుకున్నారు.ఇంటింటి సర్వేల పేరుతో తమను తరచుగా లబ్ధిదారుల ఇళ్లకు పంపించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలకు సేవ చేయడమే తమ ధ్యేయమని, ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందిస్తామన్నారు. తమకు నోషనల్ ఇంక్రిమెంట్లు చెల్లించాలని, ఏఏస్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధితో పేదల వైద్యానికి భరోసా

చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే గోరంట్ల


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చులు భారమైన పేదవానికి కొండంత భరోసాగా సీఎం సహాయనిధి అందుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ధవళేశ్వరం, మండల పరిధిలోని 23 మందికి రూ.13,02,996 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథ కాలందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపి స్తూ, విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నా రు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవలో వర్తించని అనేక రకాల చికిత్సలకు లక్షలు ఖర్చు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నియోజకవర్గంలోని 212 మందికి రూ.2.5 కోట్ల సీఎం సహాయనిధి అందించామన్నారు.ఇదిలా ఉండగా ధవళేశ్వరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గోరంట్ల తనిఖీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కళాశాలలో అనేక అవకతవకలు జరిగాయని,కల్యాణ మండపాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చారన్నారు. వీటన్నింటిపై విచారణ జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, గోరంట్ల రవిరామ్ కిరణ్,వాసిరెడ్డి రాంబాబు, మత్యేటి ప్రసాద్, పండూరి అప్పారావు, తలారి మూర్తి, ఆళ్ల ఆనందరావు, గుర్రా వెంకట్రావు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలపై 2023 డిసెంబర్‌లో జరిగిన గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెకు న్యాయకత్వం వహించినందుకు అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహాదేవయ్యను ఉద్యోగం నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ రాజమహేంద్రవరంలో తపాలా ఉద్యోగులు నిరసన ధర్నా చేశారు. శుక్రవారం సాయంత్రం హెడ్ పోస్టాఫీసు వద్ద ఎన్ఎఫ్‌పీఈ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమండ్రి డివిజన్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి బిజకొండబాబు మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలను అణచివేసే చర్యలు దశాబ్ద కాలంగా మనదేశంలో తీవ్రస్థాయిలో జరుగుతున్నాయన్నారు. పోస్టల్ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న ఏఎఫ్‌పీఏఈ, ఏఐపీఈయూ జీఆర్-సి సంఘాల గుర్తింపులను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగ సంఘాల నాయకుడిని ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమని వారు పేర్కొన్నారు.

బుద్ధ విహార్‌లో ఆయుర్వేద మొక్కల పరిశీలన

కడియం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మొక్కల పెంపకం ద్వారా మానవుని జీవన ప్రమాణాలు పెరుగుతాయని ఆయుర్వేద, ఔషధ, సుగంధ ద్రవ్యాల మొక్కల సంస్థ డిప్యూటి ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ కె.ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయుర్వేద వైద్యులు వేమగిరి మహోదయ యాజరా బుద్ధవిహార్‌ను సందర్శించి ఆయుర్వేద మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ కోరుకొండ మండలం గాదరాడ రైతులకు అవగాహన కల్పించడానికి బుద్ధవిహార్‌ను సందర్శించామన్నారు.ఔషధ మొక్కల సాగుతో పాటు రైతులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వర్మ, కలిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ హక్కులపై అవగాహన అవసరం


రంగంపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణ హక్కులపై అవగాహన పెంచుకోవడంలో చైతన్యవంతులు కావాలని తహశీల్దార్ కోసు అనసూయ పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీవో ఎ.కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు నివారించడంలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన బి.పల్లవి, ఎం.దీక్షిత నవ్య, జి.భాస్కరశ్రీ, కె.పూర్ణిమ వసుధ, ఎం.జాహ్నావి, తదితరులకు జడ్పీటీసీ సభ్యులు పేపకాయల రాంబాబు, సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మీ, కూటమి నాయకులు గారపాటి రాంబాబు, గిరజాల సత్తిబాబు, దూబాసి వరప్రసాద్, పోతుల చిన్నికాపు, గుండుబిల్లి ప్రసాద్, మండవిల్లి గుప్తా, ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.వరలక్ష్మీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమణాంజలి, నందీశ్వరీ, తదితరులు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం ప్రముఖ సైకత శిల్పి దేవిన ధన్యతను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

రాజమహేంద్రవరం కల్చరల్,అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మంగళవారపుపేట కుమ్మరి వీధిలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని కుమ్మరి శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన, ఆలయ కమిటీ సభ్యులు ఏడిద శ్రీనివాస్, కొనాల ధనరాజు, కొలుకూరి శ్రీనివాసరావు, ఉమా శంకర్, కోనాల సత్యనారాయణ, మంతెన వీర్రాజు, పవన్ దుర్గకళ్యాణ్ తదితరులు పర్యవేక్షించారు.

ఆర్ట్స్ కళాశాలలో దీక్షారంభ్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం దీక్షారంభ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో గెయిల్ ఇండియా లిమిటెడ్ సీనియర్ మేనేజర్ ఎన్.రామయ్య పాల్గొని మాట్లాడుతూ రసాయనశాస్త్రం చదవడం ద్వారా మంచి ఉద్యోగావకాశాలు పొందవచ్చని అన్నారు. కెమికల్ ఇండస్ట్రీ, ఫార్మస్యూటికల్ ఇండస్ట్రీ వంటి రంగాల్లో ఉపాధికి అవకాశం ఉంటుందని అన్నారు. విద్యార్థులకు నవరత్న కంపెనీల్లో ఉన్న ఉద్యోగావకాశాలు వివరించారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.





వరాహస్వామి అలంకరణలో శ్రీవారు

దేవదేవంభజే లోపలి పేజీల్లో

» ఘనంగా ప్రారంభమైన వాడపల్లి బ్రహ్మోత్సవాలు



చుక్కలనంటిన వెండి ధర!

కిలో రూ. 1,72,000 .. రూ.2 లక్షలవుతుందని అంచనా

మార్కెట్‌లో పెరిగిన కొనుగోళ్లు.. 9 నెలల్లో రెట్టింపు

బంగారమూ పరుగే.. 22 క్యారెట్ 1,13,400

24 క్యారెట్ 10 గ్రాముల ధర రూ.1,23,710

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బంగారం, వెండిపై మోజు పెరిగే కొద్దీ వాటి ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. బంగారం ధరలు వినియోగదారులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. అదే బాటలో వెండి సైతం రికార్డులు సృష్టిస్తోంది. శుక్రవారం మార్కెట్‌లో కిలో వెండి ధర అనూహ్యంగా పెరిగి రూ.1,72,000కు చేరింది. ఈ ఏడాది జనవరిలో వెండి ధర రూ.88,400 మాత్రమే. ఈ తొమ్మిది నెలల పదిరోజుల్లో ఏకంగా రెట్టింపు అయింది. త్వరలో కిలో వెండి రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉన్నట్టు మార్కెట్ వర్గాల అంచనా. రేట్లు రోజుకురోజుకు పెరుగుతుండడంతో వెండి కొనుగోలు చేసేవారి సంఖ్య కూడా పెరిగింది. భవిష్యత్ అవసరాల కోసం ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇక బంగారం ధరలు ఇప్పటికే చాలావరకు దూసుకెళ్లాయి. బంగారం ఇక సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందని వస్తువుగా మారిపోతుందేమో అనే రీతిలో ధరలు పెరిగిపోయాయి. ఆగస్టు 29న 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.94,700గా ఉంది. రాజమండ్రి మార్కెట్‌లో గురువారం నాటికి 22 క్యారెట్ ధర రూ.1,13,800కు పెరిగింది. శుక్రవారం 400 తగ్గి రూ.1,13,400 వద్ద నిలబడింది. 24 క్యారెట్ బంగారం ధర 1,23,710గా ఉంది. ఈ ఏడాది జనవరి 1 నాటికి 22 క్యారెట్ ధర కేవలం 71,150గా ఉంది. 24 క్యారెట్ బంగారం ధర రూ.78వేలు మాత్రమే. ప్రస్తుత ధరలు ఇంకా పెరుగుతాయనే ఆందోళనతో వెండి కిలో బార్లు, క్వాయిన్లు, బంగారం బిస్కట్ రూపంలోనూ కొందరు కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం.

'రుణం' లేదేమో!

» ఐదు నెలలుగా నిలిచిపోయిన బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల రుణాలు

» యూనిట్ల సంఖ్య పెంపు పేరుతో మంజూరైనవి మే నెల నుంచి నిలిపివేత

» అసలెప్పుడు మంజూరవుతాయో తెలియక లబోదిబోమంటున్న లబ్ధిదారులు

» అటు నియోజకవర్గాల్లో సమాధానాలు చెప్పలేక ఎమ్మెల్యేలూ సతమతం

» ఉమ్మడి జిల్లాలో 2,405 బీసీ కార్పొరేషన్ యూనిట్లకు 32,448 దరఖాస్తులు రాక

» ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే 2,732 యూనిట్లకు 13,317 దరఖాస్తులు

» నెలలు గడుస్తున్నా ఉలుకుపలుకూ లేని అధికారుల తీరుతో నిరుద్యోగుల్లో బెంగ



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల కింద నిరుద్యోగులకు ఇచ్చే స్వయం ఉపాధి యూనిట్లకు గ్రహణం పట్టింది. అప్పటి సీఎం జగన్ ఆనవాయితీగా వస్తోన్న రుణాల మంజూరు ప్రక్రియను పూర్తిగా నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం తరఫున స్వయం ఉపాధి పొందే అవకాశం లేక ఎందరో పేదలు నష్టపోయారు. అయితే ప్రభుత్వం మారాక మళ్లీ బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు మంచిరోజులు వచ్చాయి. చాలా ఏళ్ల తర్వాత ఆగిపోయిన రుణాలను మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో ఈ ఏడాది ఆరంభంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల పరిధిలో స్వయం ఉపాధి యూనిట్లను ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసింది. ఈ యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు అప్పగించింది. నిరుద్యోగులకు లాభదాయకంగా ఉంటే స్వయం ఉపాధి యూనిట్లను అధికారులు గుర్తించి మంజూరుచేయాలని ఆదేశించింది. ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో ప్రభుత్వం నలభైశాతం, బ్యాంకు రుణం అరవై శాతం వచ్చేలా చేయాలని అధికారులు నిర్ణయించారు. అందులోభాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ విభాగాల్లో అధికారులు 2,405 రుణ యూనిట్లు మంజూరుచేశారు. ఫ్లవర్ బొకేలు, వర్మీకంపోస్టు యూనిట్, వెబ్ సైట్ డెవలప్‌మెంట్, ఎల్ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్‌రీసైక్లింగ్ యూనిట్లు, ఫిష్ ఫార్మింగ్, అడ్వంచర్ టూరిజం, సబ్బుల తయారీ, మొబైల్‌కార్ వాష్, బేకరీ, ఫ్లై యాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీపార్లర్, మెడికల్ ల్యాబ్, మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో, కారు, గూడ్స్ ట్రక్ ఇలా నచ్చిన వ్యాపారం ఏదైనా చేసుకునేలా దరఖాస్తు నిబంధనలు విధించారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందల్లో ఉన్న యూనిట్లకు వేలల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. బీసీ కార్పొరేషన్ పరిధిలో కాకినాడ జిల్లాకు రూ.39.52కోట్ల విలువైన 1,914 యూనిట్లకు31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147 మంది పోటీపడ్డారు. కాపు కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాలో రూ.28.24కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోనసీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది దరఖాస్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14కోట్ల విలువైన 511యూనిట్లు మంజూరవగా, ఆరు వేల దరఖాస్తులు వచ్చాయి. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లకు 5,497, కోనసీమ జిల్లాకు 1,043యూనిట్లకు 3,265, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తు చేశారు. అతి కష్టంపై వీటిని పరిశీలించిన అధికారులు ఏప్రిల్‌లో బీసీ కార్పొరేషన్ పరిధిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ రుణానికి ఆమోదం ఇచ్చారు. జాబితాలను బ్యాంకులకు పంపగా చాలావరకు రుణాలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇక యూనిట్లు చేతికి అందడ మే తరువాయి అనుకున్న తరుణంలో మే 8న అమరావతి నుంచి ఉన్నతాధికారులు తక్షణం యూనిట్ల మంజూరును నిలిపివేయాలని నోటి మాట ఆదేశాలు జారీచేశారు. దీంతో కంగుతిన్న లబ్ధిదారులు ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో వీటిని త్వరలో రెట్టింపు చేయనున్నట్లు వివరించారు.

ఉలుకుపలుకూ లేదంతే...

మే8న నిలిపివేసిన స్వయం ఉపాధి యూనిట్లను ఇప్పటికీ అధికారులు ప్రారంభించలేదు. ఒకరకంగా చెప్పాలంటే అయిదునెలల నుంచీ కనీసం వీటిపై సమాధానం కూడా ఇవ్వడం లేదు. దీంతో లబ్ధిదారులు ఈసురోమంటున్నారు. స్వయం ఉపాధి పథకానికి ఎంపికయ్యామని సంతోషిస్తే తీరా చేతికి అందినట్లే అంది చేజారిపోవడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాస్తవానికి లేకలేక మంజూరైన యూనిట్లపై లబ్ధిదారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇవి చేతికి వస్తే ఉపాధి లభిస్తుందని సంతోషపడ్డారు. కానీ అదనపు యూనిట్ల మంజూరు పేరుతో మొత్తం నిలిపివేయడంతో వీరంతా లబోదిబోమంటున్నారు. ఐదు నెలలు దాటిపోయినా అసలు ఇవి మంజూరు చేస్తారా? లేదా? అనేదానిపై జిల్లాల అధికారులకు కూడా సమాచారం లేకపోవడంతో లబ్ధిదారులకు ఏం చెప్పలేకపోతున్నారు. అటు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు సైతం తాజాగా ఈ తలనొప్పి పట్టుకుంది. పథకానికి ఎంపికైన లబ్ధిదారులు, అదనపు యూనిట్ల కోసం చూస్తోన్న నిరుద్యోగులు సైతం ఎమ్మెల్యేలు, వారి అనుచరుల చుట్టూ తిరుగుతున్నారు. ఇవి ఎప్పుడు మంజూరవుతాయో తెలుసు కోవాలంటూ ఒత్తిడి తెస్తుండడంతో ప్రజాప్రతినిధులకు ఏం పాలుపోవడం లేదు. పైగా మంజూరైన యూనిట్లు పెంచాలని ఒత్తిడి తెచ్చింది తామే అయినా చివరకు ఉన్నవీ నెలల తరబడి ఆగిపోవడంతో సమాధానాలు చెప్పలేక గింజుకుంటున్నారు. వాస్తవానికి యూనిట్ల సంఖ్యను అధికారులు పెంచాలనుకుంటే తొలివిడత యూనిట్ల మంజూరు ప్రక్రియను పూర్తిచేసి రెండోదశ ప్రక్రియ ఆ తదుపరి ప్రారంభిస్తే నిరుద్యోగులకు ఏఇబ్బంది ఉండేది కాదు. తీరా పెంపు పేరుతో అసలుకే ఎసరు పడడంతో అంతా తలపట్టుకుంటున్నారు. మరోపక్క ప్రభుత్వం రావడంతో తమ బంధువులకు సైతం ఏదొక ఉపాధి యూనిట్ మంజూరు చేయించుకోవాలని భావించిన పార్టీ నేతలు, క్యాడర్‌కు నిరాశే ఎదురైంది. తాజాగా అయిదు రోజుల కిందట అమరావతిలో సంక్షేమశాఖలపై సమీక్ష జరిగింది. యూనిట్ల పెంపు, మంజూరుపై ఇందులో స్పష్టత వస్తుందని అంతా భావించినా ఈ ప్రస్తావన లేకపోవడంతో ఎప్పుడు మంజూరవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

జీఎస్టీ జోష్

» జిల్లాలో విస్తృత ప్రచారం » రాజమండ్రిలో ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

» జీఎస్టీ సంస్కరణలతో తగ్గిన ధరలు » ప్రతీ కుటుంబానికి లబ్ధి : జేసీ



సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ పేరుతో ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ మేఘస్వరూప్

రాజమహేంద్రవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీఎస్టీ అమలుపై విస్తృత ప్రచారానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. గత నెల 22వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ 2.0 విధానం వల్ల రెండే శ్లాబ్ రేట్లు అమలులోకి రావడంతో పలు వస్తువులపై జీఎస్టీ తొలగించడంతోపాటు, కొన్నింటిపై శ్లాబ్ తగ్గించడంతో ఈ ఫలితాలను ప్రజలకు చేర్చడానికి ప్రభుత్వం నడుంబిగించింది. గత నెల 22 నుంచి రోజుకు ఒక కార్యక్రమం కింద జిల్లావ్యాప్తంగా ప్రచారం సాగిస్తోంది. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు కూడా వివిధ మాల్‌లను తనిఖీ చేయడంతోపాటు, వ్యాపారులకు, ప్రజలకు కూడా అవగాహన పరుస్తున్నారు. ఈ క్రమంలోనే రాజమహేంద్రవరంలోని ధర్మంచర హాల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, జీఎస్టీ తూర్పు, కోనసీమ జిల్లాల జాయింట్ కమిషనర్ ఎం. సుధాకరరావు ప్రారంభించారు. వివిధ మండలాల్లో కూడా వేర్వేరుగా వాణిజ్య పన్నులశాఖ అధికారులు ప్రదర్శనలు, అవగాహన నిర్వహించారు. ఆల్‌కాట్ గార్డెన్స్ సర్కిల్ అధికారులు వీఎల్ పురంలో నిర్వహించగా, దీనికి వ్యాపారులు ఎక్కువగా హాజరయ్యారు. శనివారం కూడా ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ఆయా వస్తువుల ధరలు తగ్గడంతో జిల్లాలో ప్రతీ కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజలకు లాభాలు ప్రత్యక్షంగా లభించేలా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పేరుతో ప్రజలకు అవగాహన పెంచడమే లక్ష్యమన్నారు. టీవీలు, ఏసీలు, బీక్సీలు, వాషింగ్ మిషన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో వినియోగదార్లకు రూ.5 వేల నుంచి 15 వేలవరకూ లబ్ధి చేకూరుతుందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాలకు ఆర్థిక లాభం కలుగుతుందని చెప్పారు. జీఎస్టీ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని ఆయన అధికార్లను ఆదేశించారు. మండల గ్రామ స్థాయిల్లో కూడా అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నట్టు చెప్పారు. జీఎస్టీ (స్టేట్) జాయింట్ కమిషనర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశం జీఎస్టీ తగ్గింపు ఫలాలు వినియోగదార్లకు అందాలన్నదే అని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ టీవీ నాగేశ్వరరావు, ఆఫీసర్లు హస్సేన్ షరీఫ్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కె. సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి. పక్కన ఎన్ఎస్ఐసీ జీజీఎం సురేష్‌బాబు తదితరులు

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణం ఉందని.. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలు మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం-నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ ద్వారా తొలిసారిగా ఇక్కడ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువ పారిశ్రామికవేత్తలకు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. పరిశ్రమలు ఏర్పాటుచేసే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా ప్రగతి మార్గంలో పయనిస్తున్న వారి అనుభవాలను యువ పారిశ్రామికవేత్తలకు తెలియజేయాలన్నారు. పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న సబ్సిడీలు, మార్కెట్ అవకాశాలు, శిక్షణ, రుణ సదుపాయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. టాటా ఇన్నోవేషన్ హబ్ తరహాలో ఎస్సీ, ఎస్టీ హబ్ అందిస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకోవాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ఎంఈ యూనిట్ల స్థాపనకు ప్రోత్సాహకాలు అందించడానికి సిద్ధంగా ఉన్నాయని.. ఎస్సీ, ఎస్టీ యువత, మహిళలు ముందుకు రావాలన్నారు. ఎస్సీ ఎస్టీ హబ్‌పై మరింత సమాచారం కోసం 040-27125618 నెంబరులో లేదా ఎస్సీ, ఎస్టీ హబ్ వెబ్‌సైటులో సంప్రదించాలని నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ జోనల్ జనరల్ మేనేజర్ వి.సురేశ్‌బాబు సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం రామన్ శ్రీనిధర్, ఏపీఐఐసీ జెడ్ఎం పద్మజ పాల్గొన్నారు.

జిల్లాలో యథాతథంగా ఉచిత వైద్యసేవలు

ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ ప్రియాంక వెల్లడి


రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలు యథాతథంగా కొనసాగుతున్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి. ప్రియాంక తెలిపారు. ఈమేరకు శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మె కారణంగా వైద్యసేవలకు సంబంధించి జిల్లా ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, సాధారణ ఉచిత వైద్యసేవలు పొందవచ్చన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సేవలు అందుబాటులో ఉన్నాయని, అదనంగా జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పటల్, రాజమహేంద్రవరంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఉచిత సేవలు లభిస్తాయన్నారు. ఉచిత వైద్యసేవలకు ఏమైనా సహాయం అవసరమైతే డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయ అధికారి సెల్ 9281068129, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయం నెం: 9281068159 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

మహిళల సెల్‌ఫోన్లలో శక్తి యాప్ ఉండాలి : ఏఎస్పీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల సెల్‌ఫోన్లలో శక్తి యాప్ ఉంటే భద్రతాపరంగా అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని అదనపు ఎస్పీ (పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వల్ల దుష్ప్రభావాలు, మహిళల రక్షణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. గుర్తు తెలియని, అపరిచిత వ్యక్తులతో చాటింగ్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వాటికి దూరంగా ఉండడం శ్రేయస్కరమన్నారు. ఓటీపీలు ఇతరులకు చెప్పడం, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయడం, బ్యాంకు ఖాతా వివరాలను అపరిచితులతో పంచుకోవడం వల్ల చిక్కుల్లోపడే ప్రమాదం ఉందన్నారు. పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, కేవైసీ అప్‌డేట్ అంటూ వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబపరమైన నష్టాలు, మహిళలు స్వీయరక్షణ టెక్నిక్స్, పోక్సో చట్టం, సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై వివరించారు. మోసపోకుండా ఉండాలంటే అప్రమత్తతే తొలి ఆయుధంగా గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి, ఎస్సై అమీనాబేగం, జిల్లా సైబర్ ల్యాబ్ పోలీసులు వై.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న జేసీ వై.మేఘ స్వరూప్

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలి : జేసీ

కొవ్వూరు,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు గోనె సంచులను అందుబాటులో ఉంచుకోవాలని జాయింటు కలెక్టర్ వై. మేఘస్వరూప్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొవ్వూరు పట్టణ, మండలంలోని రైతు సేవా కేంద్రాలు, సొసైటీలతోపాటు కొవ్వూరులో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర రైస్ మిల్లు, కాపవరంలో జొన్నలగడ్డ ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్‌మిల్లులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాల్లో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు అన్ని వసతులు ఉన్నాయా, పూర్తిస్థాయి సిబ్బంది ఉన్నారా అని పరిశీలించారు. అలాగే గోనె సంచులు, సార్టెక్స్ కెపాసిటీలను పరిశీలించారు. కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జేసీ అధికారులను ఆదేశించారు. జేసీ వెంట పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ బి.గణేష్‌కుమార్, జిల్లా సరఫరా అధికారి వి.పార్వతీ, తహసిల్దార్ ఎం.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారి ఎ. గంగాధర్, సీఎస్‌డీటీ సునీత పాల్గొన్నారు.



మహిళా సంఘ సభ్యులు తయారు చేసిన అగరుబత్తీలను కలెక్టర్ కీర్తికి అందజేస్తున్న దృశ్యం

'మహిళలు ఆదాయ వనరులు సృష్టించడం అభినందనీయం'

కడియం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): పూల వ్యర్థాలతో మహిళలు అగరబత్తీలు తయారు చేయడం, స్వయం ఉపాధి ద్వారా ఆదాయ వనరులు సృష్టించడం ప్రశంసనీయం అని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం కడియం ప్రాంతంలో అగరబత్తీల తయారీ యూనిట్, కొబ్బరి తాళ్ల యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ పొందిన మహిళలతో సమావేశమై మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ దిశలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మరిన్ని యూనిట్లు స్థాపించేందుకు మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. డిమాండ్‌కు అనుగుణంగా యూనిట్ స్థాపన ఉండాలి... భవిష్యత్తులో ఏర్పాటు చేసే యూనిట్ల విషయంలో ముడిసరుకు, లభ్యత నుంచి మార్కెటింగ్ వరకు ప్రతీ అంశాన్ని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఆ మేరకు ఖచ్చితత్వం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. అలాగే మార్కెటింగ్ సహకారం కీలకమని, మహిళల చొరవతో కడియం నేచురల్ అగరబత్తీలు అనే ప్రత్యేక బ్రాండ్ రూపుదిద్దుకోవడం గర్వకారణమని కలెక్టర్ ఆ మహిళలను అభినందించారు. బ్యాంకు సహకారంతో తొలిదశలో 12 మంది మహిళలు యూనిట్ స్థాపనకు ముందుకు రావడం ప్రశంసనీయం అన్నారు. అనంతరం కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవానర్సరీని కలెక్టర్ కీర్తి చేకూరి సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందజేసి కలెక్టర్ కీర్తి చేకూరికి స్వాగతం పలికారు. అలాగే కడియపులంక పూల మార్కెట్‌ను సందర్శించారు.

రూ7.32 కోట్లతో గ్రీనింగ్ కారిడార్ల అభివృద్ధి : కలెక్టర్ కీర్తి

గతేడాది ఆమోదించిన పనులు వందశాతం పూర్తిచేయాలి.. అధికారులతో సమీక్ష

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గతేడాది రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో ఆమోదించిన పనులు వందశాతం పూర్తి చేయాలని ఇంచార్జి కమిషనర్ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో డిస్ట్రిక్ లెవెల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ)కింద రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న పనులపై అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ7.32 కోట్లతో చేపడుతున్న గ్రీనింగ్ కారిడార్ల అభివృద్ధి పనులు, పెద్ద మొక్కలు నాటడం, అలాగే అకిరా మియావాకి మోడల్ మొక్కలు పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వాయుకాలుష్యం మరింతగా తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని దిశనిర్దేశం చేశారు. ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్ల నిర్వహణ మరింత క్రమబద్ధంగా చేపట్టాలని, 2030 నాటికి మొత్తం వాహనాల్లో కనీసం 30 శాతం వాహనాలు ఎలక్ట్రిక్ వాహనాలు ఉండేలా లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను సీఎన్‌జీ మోడ్‌కి కన్వెర్ట్ చేసే చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పీసీబీ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎంవీఎస్ శంకర్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, కార్పొరేషన్ ఎస్ఈ ఇన్చార్జి రీటా, డీఈ కె.లోవరాజు పాల్గొన్నారు.

సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలి

● రైల్వే డీఆర్‌ఎంకు వినతి


డీఆర్‌ఎంను కలిసిన బీజేపీ నాయకులు

నిడదవోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు రైల్వే జంక్షన్ అభివృద్ధితో పాటు స్టేషన్‌లో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ కల్పించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆది నారాయణ, ప్రజాసంఘాల, కూటమి నేతలు కోరారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని రైల్వే జంక్షన్‌ను రైల్వే డీఆర్‌ఎం మోహిత్ సోనాక్య సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు నిడదవోలు జంక్షన్‌లో జన్మభూమి, ఎల్‌టీటీ, కోకనాడ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు నిడద వోలు నర్సాపురం పాసింజర్ ట్రైన్ పునరుద్ధరించాలని విన్నవించారు. అలాగే అమృతభారత్ రైల్వేస్టేషన్‌గా ఎంపిక చేసి అభివృద్ధిపర్చడం అభినందనీయమని, అయితే దూరప్రాంత ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ కల్పించినప్పుడే అభివృద్ధి చెందుతుందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సీపీఎం నేత జువ్వల రాంబాబు, తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు నేషనల్ క్వాలిటీ సర్టిఫికెట్


సర్టిఫికెట్ పొందిన సచివాలయ సిబ్బంది

పెరవలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి ఖండవల్లి-2 సచివాలయం (లంకమాలపల్లి) ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు నేషనల్ క్వాలిటీ సర్టిఫికెట్ సాధించినట్టు పెరవలి పీహెచ్‌సీ వైద్యుడు రాజనాల ప్రసాద్ తెలిపారు. జాతీయ క్వాలిటీ టీమ్ గత నెల 2వ తేదీన ఈ ఆరోగ్య కేంద్రాన్ని ఆన్‌లైన్ ద్వారా పరిశీలించింది. ఈ మేరకు సంతృప్తి చెందడంతో క్వాలిటీ సర్టిఫికెట్ మంజూరు చేసింది. దీనికోసం ఆరోగ్య కేంద్రం 2వ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజశ్రీ, సూపర్‌వైజర్ రాజేష్‌బాబు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎం స్వప్న, రమ్యకృష్ణ, ఆశా కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక రుగ్మతలపై అవగాహన

కొవ్వూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు వాత్సల్య వృద్ధాశ్రమంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక రుగ్మతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌చార్జి ఏ.రవి మాట్లాడుతూ మెదడులో రసాయనాలు, న్యూరో ట్రాన్స్‌మీటర్‌లో హెచ్చుతగ్గుల వల్ల మానసిక వ్యాధులు వస్తాయన్నారు. మానసిక ఒత్తిడి, ఆందోళన, బుద్ధిమాంద్యం, ఆటిజమ్‌లను సకాలంలో గుర్తించి వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పి.జయరాజు, వై.సుబ్రహ్మణ్యం, బీ.వెంకటేశ్వరరావు, సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, కె.కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు వీఏవోల కృతజ్ఞతలు


ఉండ్రాజవరంలో ఆనందంతో కృతజ్ఞతలు తెలుపుతున్న వీఏవోలు

ఉండ్రాజవరం, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా వీఏవోలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగ భద్రత కల్పించారని మండలంలోని వీఏవోలంతా శుక్రవారం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల వీఏవోల సంఘ నాయకురాలు గద్దే రాజేశ్వరి మాట్లాడుతూ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దుచేసి తమకు ఉద్యోగ భద్రతకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారని కొనియాడారు. తమ విధులకు అవసరమైన ఆధునిక టెక్నాలజీ కలిగిన 5జి ఫోన్లను అందజేస్తామని ఇటీవల సంబంధిత మంత్రి ప్రకటించారని సంతోషం వ్యక్తం చేశారు. తమ సొంత ఖాతాల్లో జీతాలు జమచేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వీఏవోలు గారపాటి శ్రీదేవి, చల్లా కరుణ, నందిగం హేమలత, మడిచర్ల జయసుధ, అరిగెల వెంకటలక్ష్మి, బిరుదుకోట భవాని, వీఏవోలు, తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన


ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయం వద్ద దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, అభిషేకాలు, నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కోశాధికారి కామిశెట్టి దుర్గారావు, కమిటీ సభ్యులు గారపాటి అప్పారావు, పైడికొండల శివయ్య, జాజిమొగ్గల ప్రభాకరరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికల దినోత్సవం

దేవరపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికల అక్రమ రవాణాను అరికట్టాలని గోపాలపురం ఐసీడీఎస్ పీవో మమ్మీ పేర్కొన్నారు. శుక్రవారం యర్నగూడెం, రామన్నపాలెం, దుద్దుకూరు జడ్పీ హైస్కూళ్లలో అంగన్వాడీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ విజయశాంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హెచ్‌ఎంవీర్రాజు ఉన్నారు.

తాళ్లపూడి: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని బాలికలకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి మాట్లాడుతూ కౌమార దశలోకి వచ్చిన బాలికలు పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో పాఠశాల బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నల్లజర్ల: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం దూబచర్లలో నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దూబచర్ల సెక్టార్ పరిధిలోని హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాలు, ట్రాఫికింగ్ వంటి అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం. హారతి, హైస్కూల్ హెచ్‌ఎం సుమతి, కార్యకర్తలు మంగరాణి, రమ్య, దేవకి, రామలక్ష్మి, విమల, జయమ్మ రత్నకుమారి, మైకేలమ్మ, జగదీశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

తాళ్లపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురానికి చెందిన దూపాని మహేష్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపియ్యాడు. ఈయన స్థానిక కరిబండి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల పెదవేగిలో జరిగిన అండర్-19 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. కళాశాల ప్రిన్సిపాల్ పీ. మురళి, అధ్యాపకులు, మాధవరావు, సత్యనారాయణ, రాజ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల్లో
దాతల సహకారం ఎంతో అవసరం

● కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి


ప్రభుత్వ ఆసుపత్రికి ఆక్సిజన్ సిలిండర్లు అందజేస్తున్న దాతలు

కొవ్వూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగాల్లో దాతల సహకారం ఎంతో అవసరమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి శుక్రవారం ఏఫ్రాయిము గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ గెడ్డం విలియమ్స్ 16 ఆక్సిజన్ సిలిండర్లను ఉచితంగా అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్నివసతులు కల్పించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో గెడ్డం మధుబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బర్ల శ్రీనివాస్, పోచవరం సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్, క్రిస్టియన్ కౌన్సిల్ పొలిటికల్ వింగ్ స్టేట్ ప్రెసిడెంటు కొల్లి సాక్షిబాబు, బిషప్ కె.జోసఫ్, జో.వి.విల్సన్‌రాజు, కొడమంచిలి సంతోష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పేద, మధ్య తరగతి ప్రజలకు భారం తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ 2.0లో సంస్కరణలు తీసుకువచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. కొవ్వూరు విజయవిహార్ సెంటర్‌లో శుక్రవారం ధనలక్ష్మీ ఏజన్సీస్ సహకారంతో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుపరిమి రాధాకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కమర్షియల్ టాక్స్ అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 11 ఫిర్యాదులు

గ్రీవెన్స్‌లో రాత పూర్వకంగా ఫిర్యాదు చేసి, ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

రైతు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి : తహశీల్దార్

దేవరపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోకుండా రైతు కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకోవాలని తహశీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ధాన్యం కొనుగోలుపై అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖాధికారి కమలరాజు మాట్లాడుతూ సార్వా సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ముఖ్యంగా టెక్నికల్ అసిస్టెంట్లు ధాన్యం శాంపిల్స్‌ను సరైన పద్ధతిలో సేకరించాలని, తద్వారా ఆర్‌ఎస్‌కే మిల్లు మధ్య తేమశాతంలో వచ్చే వ్యత్యాసాల వల్ల సమస్యలు నివారించవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లో పండించిన ధాన్యానికి ఎన్ని గోను సంచులు కావాలనే అంచనా వేసి ఆర్‌ఎస్‌కే కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, వ్యవసాయ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశరావుపాలెంలో తాటాకిల్లు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నల్లజర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకాశరావుపాలెంకి చెందిన ఊర మహంకాళీకి చెందిన తాటాకిల్లు శుక్రవారం మధ్నాహ్నం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో గ్రామస్థులు వచ్చి మంటను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో తాడేపల్లిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి మురళీ కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 50 వేలు విలువ చేసే సామగ్రి కాలిపోయినట్టు అధికారులు అంచనా వేశారు.

ఉపాధి పథకం పీడీ తనిఖీలు


ఉనకరిమిల్లిలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న పీడీ నాగ మహేశ్వరరావు

నిడదవోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా జరగాలని ఆ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగ మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉనకరిమిల్లి, విజ్జేశ్వరంలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న డ్రైనేజీ పనుల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయనతో ఏపీవో ఏవీ సత్యనారాయణ, భాస్కర్, తదితరులు ఉన్నారు.

బాలికలు బాగా చదువుకోవాలి

చాగల్లు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చాగల్లు జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పీ. పద్మావతి మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవాలని, బాల్య వివాహాలు చేసుకుంటే అనర్థాలు కలుగుతాయన్నారు. అనంతరం బాలికా విద్యపై బాలికలకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వాసవి, టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల శిక్షణ తరగతులు


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఎంపీపీ కాకర్ల నారాయుడు, ఇతరులు

కొవ్వూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తాళ్లపూడి, దేవరపల్లి మండలాల ఎంపీపీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు క్లస్టర్ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై రెండు రోజుల శిక్షణ తగతులను ఎంపీడీవో టీబీవీ రమణ అధ్యక్షతన నిర్వహించారు. మాస్టర్‌ట్రైనీలు జేవీఎస్ మూర్తి, పి.హరిబాబు, పి.సతీష్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాలు, మండలాల్లో సుస్థిర అభివృద్ధి స్థానికీకరణపై పావర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణను అందజేశారు. కార్యక్రమంలో తాళ్లపూడి, దేవరపల్లి మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయానికి ప్రింటర్


తహశీల్దార్‌కుఅందిస్తున్న శ్రీరామచంద్రరావు

గోపాలపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారం అభినందనీయమని తహశీల్దార్ సాయి ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో టీడీపీ మండల అధ్య క్షుడు కొర్లపాటి శ్రీరామచంద్ర రావు రూ. 25 వేల సొంత నిధులతో సమకూర్చిన నూతన జిరాక్స్ కమ్ ప్రింటర్‌ను తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కార్యాలయంలో ప్రింటర్ కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందన్నారు. దీంతో దాత శ్రీరామచంద్రావు కొనుగోలు చేసి అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు వేముల నాగరాజు, టీడీపీ సీనియర్ నేతలు జ్యేష్ట శ్రీనివాసరావు, యండ్రప్రగడ మంగారావు, కరిచర్లగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్‌భాష, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మద్దిపాటి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడంలో ..
వైసీపీ రాజకీయ కుట్ర : ఎమ్మెల్యే ముప్పిడి


అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, కాశి నవీన్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా దేవలంపేటలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం వైసీపీ రాజకీయ కుట్రలో భాగమేనని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆరోపించారు. దీనిపై రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద నుంచి గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి, కాశి నవీన్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు మద్దా మణి, వేమగిరి వెంకటరావు, టీడీపీ నాయకులు తలారి మూర్తి పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు బొర్రా చిన్ని, మొకమాటి సత్యనారాయణ, డాక్టర్ కవులూరి వెంకట్రావు, దుత్తరపు గంగాధర్, అజ్జ రపు రమేష్, కోరుమిల్లి విజయశేఖర్, ప్రభుదాస్, ఆంటోని, కప్పల వెలుగుకుమారి, సురేష్, సాల్మన్, బత్తుల కిరణ్, కే. వీర్రాజు, కృపామణి, మణి, తురకల నిర్మల, మోతా నాగలక్ష్మి, కొవ్వూరు దళిత నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టైమింగ్ బెల్ బహూకరణ

నిడదవోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి రోటరీ ఎనలేని సేవలు అందిస్తోందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల శివ రామ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం తిమ్మరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రోటరీ సభ్యుడు అడ్డాల సత్యప్రభాకర్ ఆర్థిక సహకారంతో ఆటోమెటిక్ టైమింగ్ బెల్‌ను అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మీసాల శివ రామ హరిప్రసాద్ మాట్లాడుతూ రోటరీ సభ్యులు సమాజసేవలో భాగస్వామ్యం కావడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, అయినీడి పల్లారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, అడ్డాల సత్యప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఒకరి మృతి

ఉండ్రాజవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాలంగిలో గుండెపోటుతో వ్యక్తి మరణించిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ డి.రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అమిరిశెట్టి దుర్గాప్రసాద్ (42) శుక్రవారం ఉదయం బాత్రూమ్‌కు వెళ్లిన అనంతరం అక్కడిక్కడే గుండెపోటుతో మరణించాడు. అతడు ప్రైవేటు వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు..

చివటం రైల్వే గేటు సమీపంలో సెప్టెంబరు 25న తేతలికి చెందిన గంటా గౌతమ్‌కుమార్ (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు అతన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. తణుకులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అప్పుల బాధ భరించలేక పురుగుమందు తాగినట్టు ఎస్‌ఐ తెలిపారు. అతడికి భార్య, తొమ్మిది నెలల పాప ఉన్నారు. ఎస్‌ఐ రవికుమార్ పర్యవేక్షణలో ట్రైనీ ఎస్‌ఐ కె.నవీన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

మహిళా పారిశ్రామిక వేత్తలుగా తయారుకావాలి

● డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి ● కొవ్వూరులో జిల్లా సమాఖ్య సమావేశం

కొవ్వూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ రాష్ట్రప్రభుత్వం ఆకాంక్ష మేరకు మహిళా పారిశ్రామిక వేత్తలుగా తయారుకావాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. శుక్రవారం కొవ్వూరులో జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. జిల్లాలోని 31,500 గ్రూపులకు సంబంధించి చర్చించడం జరుగుతుందన్నారు. తాము ఉపాధి పొందుతూ మరొకరికి ఉపాధి కల్పించాలన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు వచ్చే యాత్రికులు బస చేసేందుకు హోమ్ స్టే ఏర్పాటుచేయడం, గోదావరి జిల్లాల వంటకాలు మార్కెట్ చేయాలన్నారు. క్రొత్తగా ఆలోచన చేయాలన్నారు. బ్యాంకు ద్వారా రుణాలు పొంది వ్యాపారాలు ప్రారంభించి ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామిక వేత్తలు తయారుకావాలన్నారు. విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి కార్యక్రమాలు ద్వారా గ్రూపు సభ్యుల పిల్లల చదువుకు, వివాహాలకు రుణాలు అందించవచ్చునన్నారు.బ్యాంకు రుణాలను క్రమశిక్షణతో తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవివిక్రమ్

కొవ్వూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కొవ్వూరు డివిజన్ (ఏపీఆర్‌ఎస్‌ఏ) అధ్యక్షుడిగా కే.రవివిక్రమ్ ఎన్నికయ్యారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఎన్నికల అధికారి ఎం. కార్తీక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఎన్నికలలో నూతన అధ్యక్షుడిగా డిప్యూటీ తహశీల్దార్ కే.రవి విక్రమ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, కోశాధికారిగా టి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ఆర్డీవో రాణీసుస్మిత అభినందనలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడు జీ.బాపిరాజు, కార్యదర్శి ప్రసాదరావు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మహేష్ ఎంపిక

తాళ్లపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం గ్రామానికి చెందిన దూపాని మహేష్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపియ్యాడు. ఇతడు తాళ్లపూడి కరిబండి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల పెదవేగిలో అండర్ 19 విభాగంలో జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయిలో ఆడే అర్హత సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కరిబండి త్రినాథస్వామి మహేష్‌ను అభినందించారు. కళాశాల ప్రిన్స్‌పాల్ పీ.మురళి, అధ్యాపకులు, మాధవరావు, సత్యనారాయణ, రాజ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.